ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
గురువారం 10 జూలై 2025





అప్పన్న రథానికి జెండా ఊపి గిరి ప్రదక్షిణను ప్రారంభిస్తున్న ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు. చిత్రంలో ఎంపీలు శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, గణబాబు ఉన్నారు.

గిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు

జనసంద్రంగా మారిన రహదారులు

రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది రాక

- తొలిపావంచా వద్ద స్వామి వారి ప్రచార రథాన్ని ప్రారంభించిన ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు
- పాల్గొన్న ఎంపీలు ఎం.భరత్, కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, గణబాబు

మరిన్ని వార్తలు, ఫొటోలు 8వ పేజీలో



అడవివరం జంక్షన్ వద్ద స్వామివారి రథం, గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్త జనం



గిరి ప్రదక్షిణలో భక్తులు

సింహాచలం / విశాఖపట్నం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సింహ'గిరి ప్రదక్షిణ'కు భక్త జనసంద్రం పోటెత్తింది. రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. ఎటు చూసినా భక్తులే. పిల్లలు, పెద్దలు, వృద్ధులు, మహిళలు అనే తేడా లేకుండా మండే ఎండలో కాళ్లకు చెప్పులు లేకుండా హరి నామ స్మరణ చేస్తూ గిరి ప్రదక్షిణ చేశారు. ఏటా వరుణుడు కరుణించి కాసింత ఉపశమనం కలిగించేవాడు. కానీ ఈ సారి సూరీడు చురచురలాడాడు. మధ్యాహ్నం గిరి ప్రదక్షిణ ప్రారంభించే సమయానికి చాలామందికి చెమటలు పట్టేశాయి. కాళ్లు బొబ్బ లెక్కిపోయాయి. అయినా వెనకడుగు వేయలేదు. సాయంత్రం కాసింత చల్ల గాలి వీయడంతో భక్తులు హుషారుగా నడక కొనసాగించారు.

ఏటా మాదిరిగానే బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు కొండదిగువన తొలిపావంచా వద్ద స్వామివారి పుష్పతేరు (ప్రచార రథం)కు ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు జెండా ఊపి సింహగిరి ప్రదక్షిణను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు మతుకుమిల్లి శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పీజీవీఆర్ నాయుడు (గణబాబు) పాల్గొన్నారు. ఉదయం 9.00 గంటల నుంచే కొందరు గిరిప్రదక్షిణను ఆరంభించగా, మరికొందరు స్వామివారి రథాన్ని అనుసరించారు. తొలి పావంచా వద్ద కొబ్బరికాయ కొట్టి అడవివరం, శ్రీకృష్ణాపురం, హనుమంతవాక జంక్షన్, విశాలాక్షి నగర్, తెన్నేటి పార్కు, అప్పుఘర్, ఎంవీపీ కాలనీ, ఇసుకతోట, హెచ్‌బీ కాలనీ, సీతమ్మధార, నరసింహనగర్, కైలాసపురం, మాధవధార, ఎన్ఎస్‌టీఎల్, గోపాలపట్నం, శ్రీనివాసనగర్ మీదుగా తిరిగి తొలి పావంచాకు చేరుకొని ప్రదక్షిణ ముగించారు. ఆ తరువాత కొందరు కొండ పైకి వెళ్లి స్వామిని దర్శించుకోగా, మరికొందరు తొలిపావంచా నుంచి వెనుతిరిగారు. గిరి ప్రదక్షిణకు ఈసారి అధికారులు ఊహించినట్టుగానే భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు క్యూకట్టారు. స్వచ్ఛంద సంస్థలకు ఆంక్షలు పెట్టకుండా సేవలు అందించేందుకు అవకాశం కల్పించడంతో వారు గిరి ప్రదక్షిణ మార్గంలో ఎక్కడికక్కడ శిబిరాలు ఏర్పాటుచేసి భక్తులకు ... మిగతా 8వ పేజీలో



గొప్ప అనుభూతి

ఏడాదికి ఒకసారి కొండ చుట్టూ తిరిగి వెళ్లి అప్పన్న స్వామిని దర్శించుకుంటే గొప్ప అనుభూతి కలుగుతుంది. ఈ దర్శనం తరువాత మనసు ఎంతో నిబ్బరంగా ఉంటుంది. స్వామి దర్శనం అనంతరం వేయి ఏనుగుల బలం వచ్చినట్టు అనిపిస్తుంది. అందుకే గడిచిన ఆరేళ్లుగా గిరి ప్రదక్షిణ తరువాత స్వామిని దర్శనం చేసుకుని వెళుతుంటా. స్వామి నాకు అవకాశం కల్పించినంత వరకూ వస్తూనే ఉంటాను.



- వై.ప్రకాష్‌బాబు, శ్రీకాకుళం

జడ్పీ చైర్‌పర్సన్‌కు షాక్

స్వపక్షంలోనే తిరుగుబాటు

- సర్వసభ్య సమావేశానికి 22 మంది వైసీపీ సభ్యులు గైర్హాజరు
- రెండు రోజుల కిందట అనకాపల్లిలో రహస్య సమావేశం
- అవిశ్వాసం పెట్టేందుకు నిర్ణయం
- సెప్టెంబరు 24 తరువాత నోటీస్?



జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

విశాఖపట్నం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర (వైసీపీ)పై సొంత పార్టీ సభ్యులు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ఆమెపై అవిశ్వాసం పెట్టేందుకు యోచిస్తున్నారు. ఈ క్రమంలోనే బుధవారం నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి 22 మంది సభ్యులు గైర్హాజరయ్యారు. వివరాలిలా ఉన్నాయి.

చైర్‌పర్సన్ తీరుపై అసంతృప్తితో 16 మంది జడ్పీటీసీ సభ్యులు ఈనెల ఆరో తేదీన అనకాపల్లిలోని ఒక హోటల్‌లో సమావేశమయ్యారు. సుభద్రకు ప్రత్యామ్నాయంగా జి.మాడుగుల జడ్పీటీసీ సభ్యురాలు మత్స్యరాస వెంకటలక్ష్మిని జడ్పీ చైర్‌పర్సన్ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని కొందరు సభ్యులు అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లారు. పార్టీలో అంతర్గతంగా చర్చించుకుని సమస్య పరిష్కరించుకుందామని, బుధవారం నాటి జడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరుకావాలని అధిష్ఠానం ఆదేశించింది. పార్టీలో తిరుగుబాటు మంచిది కాదని శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ హెచ్చరించారు. ఈనెల 13వ తేదీన సభ్యులతో తాను మాట్లాడతానని, జడ్పీ సర్వసభ్య సమావేశానికి వెళ్లాలని ఆయన సూచించారు. అయినప్పటికీ బుధవారం జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశానికి 22 మంది సభ్యులు గైర్హాజరయ్యారు. వైసీపీ సభ్యులు 15 మంది (చైర్‌పర్సన్ సహా) మాత్రమే హాజరయ్యారు. జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు, సర్వసభ్య సమావేశం బుధవారమే నిర్వహించడంపై వారం క్రితం పార్టీ ఫ్లోర్ లీడరు, పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు అభ్యంతరం తెలుపుతూ వైసీపీ జడ్పీటీసీ సభ్యుల వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు పెట్టగా అందరూ మద్దతు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న బొత్స సత్యనారాయణ...పరవాడ జడ్పీటీసీ సభ్యుడు సన్యాసిరాజును పిలిచి మాట్లాడారు. అయినప్పటికీ బుధవారం ఉదయం తొలుత స్టాండింగ్ కమిటీ సమావేశంలో సన్యాసిరాజు లేచి నిరసన వ్యక్తంచేశారు. ఒకేరోజు రెండు సమావేశాలు నిర్వహణతో అన్ని సమస్యలపై చర్చించలేమని చెప్పారు. కాగా జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర వ్యవహారశైలితోనే ఆమెపై తిరుగుబాటు చేయాల్సి వచ్చిందని సభ్యులు చెబుతున్నారు. జడ్పీ సమావేశ మందిరం బయట రోలుగుంట జడ్పీటీసీ సభ్యురాలు పోతుల రమణమ్మ 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ కేంద్రం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధుల్లో 20 శాతం చైర్‌పర్సన్ తనకు నచ్చిన వారికి కేటాయిస్తున్నారని, అయితే ఈ విషయం తమకు కనీసం చెప్పడం లేదని ఆరోపించారు. జిల్లాకు సాధారణ నిధులు ఏ మేరకు విడుదలయ్యాయి?, వాటిలో ఏఏ పద్దుల కింద ఎంత ఖర్చు చేశారు అనే వివరాలు రహస్యంగా ఉంచుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. జడ్పీ కార్యాలయంలో సమావేశాలకు వచ్చే మహిళా సభ్యులకు కనీసం శుభ్రమైన మరుగుదొడ్లు కూడా ... మిగతా 8వ పేజీలో

నత్తనడకన రహదారి విస్తరణ పనులు

అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డును వెంటనే పూర్తి చేయాలి



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుభద్ర. చిత్రంలో విశాఖ, అల్లూరి, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు హరేంధిరప్రసాద్, దినేశ్‌కుమార్, విజయకృష్ణన్

- నీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులో జిల్లాకు అన్యాయం
- జడ్పీ నిధుల కేటాయింపుపై సభ్యులకు సమాచారం లేదు
- సమావేశంలో పలు అంశాలపై సభ్యుల ఆందోళన

విశాఖపట్నం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వరకు రోడ్డు విస్తరణ పనులు సంవత్సరాల తరబడి సాగుతున్నందున అచ్యుతాపురంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు జఠిలంగా మారుతోందని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జడ్పీ హాలులో జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో అచ్యుతాపురం జడ్పీటీసీ సభ్యుడు లాలం రాంబాబు, కో-ఆప్షన్ సభ్యుడు నిర్మల్‌కుమార్ అనకాపల్లి - అచ్యుతాపురం రోడ్డు విస్తరణ పనులపై ప్రస్తావించారు. విస్తరణకు భూములు ఇచ్చిన రైతుల గోడు ఎవరికీ పట్టడం లేదని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి విస్తరణకు భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయాలని కోరారు. అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వరకు రోడ్డు విస్తరించాల్సిందేనని స్పష్టం చేశారు. అచ్యుతాపురం జడ్పీటీసీ సభ్యుడు లాలం రాంబాబు మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో 10 శాతం పనులకు సంబంధించి ప్రభుత్వ భూముల్లో ... మిగతా 8వ పేజీలో



మాట్లాడుతున్న మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కుకు భూముల బదలాయింపు

- ప్రభుత్వ ఆమోదం



నక్కపల్లి సెజ్‌లో రహదారి అభివృద్ధి పనులు (ఫైల్)

అనకాపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నక్కపల్లిలో ఏర్పాటు కానున్న బల్క్ డ్రగ్ పార్కుకు భూ కేటాయింపు విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన 27వ ఇ-కేబినెట్ సమావేశంలో జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు భూముల కేటాయింపుల అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు అవసరాలకు ఏపీఐఐసీ ద్వారా భూములను బదిలీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు గతంలో ప్రతిపాదించిన విధంగా మొత్తం 2001.80 ఎకరాల భూములను ఇండస్ట్రియల్ పార్కు కారిడార్‌కు బదిలీ చేయనున్నారు.

ఇదే క్రమంలో నక్కపల్లిలో ఏర్పాటు కానున్న ఆర్సెల్లార్, నిప్పన్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించిన భూముల్లో 790 ఎకరాలకు కంపెనీ నగదు చెల్లించేలా అనుమతి ఇచ్చేందుకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. నక్కపల్లి సెజ్‌లో పరిశ్రమలకు కేటాయించిన స్థలంలో చేపట్టనున్న అభివృద్ధి పనులు, ప్లాంట్ డిజైన్ తదితర అంశాలపై కేంద్ర రీజనల్ ఫైనాన్స్ మినిస్ట్రీస్‌కు ప్రభుత్వం సమగ్ర నివేదిక ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది.

ఢిల్లీ సదస్సుకు కలెక్టర్ విజయకృష్ణన్

- జల్‌జీవన్ మిషన్ అమలుపై చర్చించేందుకు రాష్ట్ర ప్రతినిధిగా హాజరు

అనకాపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో గురువారం జరగనున్న జల్‌జీవన్ మిషన్ (జేజేఎం) జాతీయ సదస్సుకు కలెక్టర్ విజయకృష్ణన్ రాష్ట్ర ప్రతినిధిగా హాజరుకానున్నారు. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం నిధులతో జేజేఎం పథకం ద్వారా ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు అందించే పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకాన్ని మరింత మెరుగ్గా రాష్ట్రాల్లో అమలు చేసేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించేందుకు ఢిల్లీలో వివిధ రాష్ట్రాల నుంచి హాజరయ్యే కలెక్టర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఈ సదస్సుకు రాష్ట్ర ప్రతినిధిగా కలెక్టర్ విజయకృష్ణన్‌ను ప్రభుత్వం ఎంపిక చేయడంతో హాజరయ్యేందుకు బుధవారం సాయంత్రం ఆమె ఢిల్లీ వెళ్లారు. శనివారం సాయంత్రానికి మళ్లీ కలెక్టర్ జిల్లాకు రానున్నారు.

బడి పండుగకు వేళాయె

నేడు మెగా పేరెంట్, టీచర్ మీట్

- జిల్లా వ్యాప్తంగా 2,232 పాఠశాలల్లో నిర్వహణ
- విద్యాలయాల్లో పండుగ వాతావరణం



గురువారం జరగనున్న మెగా పేరెంట్, టీచర్ మీట్‌కు హారతులు, పుష్పాలతో తల్లిదండ్రులను ఆహ్వానిస్తున్న రోలుగుంట మండలం వెలంకాయలపాలెం ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల వైస్ చైర్మన్ ఆదిలక్ష్మి, విద్యార్థులు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి) జిల్లాలో గురువారం మెగా పేరెంట్, టీచర్ మీట్‌ను పండుగ వాతావరణంలో నిర్వహించనున్నారు. దీని కోసం పాఠశాలలు ముస్తాబయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పాఠశాలల్లో పిల్లల చదువులు, ఆరోగ్యం, బాగోగుల కోసం తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో చర్చించే కార్యక్రమానికి గత ఏడాది శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. గత ఏడాది కూడా జిల్లా విద్యాశాఖాధికారులు మెగా పేరెంట్, టీచర్ మీట్‌ను పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 2,232 పాఠశాలల్లో 1.87 లక్షల మంది పిల్లలు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హాజరు కానున్నారు. 134 జూనియర్ కళాశాలల్లో 24,781 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించి బడుల అభివృద్ధికి చర్చించనున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తారు. పాఠశాలలు, కళాశాలల ప్రాంగణాల్లో మొక్కలు నాటించనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకరించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఒక ప్రకటనలో కోరారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

▸▸ రాష్ట్ర రహదారుల కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు



పిఎన్ఆర్‌పేటలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రగడ నాగేశ్వరావు, నాయకులు

ఎలమంచిలి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే ప్రజారంజక పాలన సాధ్యమని రాష్ట్ర రహదారుల కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరావు అన్నారు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పద్మనాభరాజుపేటలో బుధవారం రాత్రి నిర్వహించారు. ఆయన పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఇతర మంత్రులతో కలిసి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెల్లుతున్నారని అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నారన్నారు. మరోవైపు హామీలైన పెన్షన్ పెంపు, తల్లికి వందనం జమ, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ చేస్తున్నారు. కార్యక్ర మంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొలుకులూరి విజయ్ బాబు, జిల్లా అధికార ప్రతినిధి కాండ్రకోట చిరంజీవి, నాయకులు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, గెంజి శ్రీను, నేతలు రాజాన నారాయణమ్మ, గొన్నాబత్తుల నాగేశ్వరావు(శేషు), ఇత్తంశెట్టి రాజు, వెంకునాయుడు పాల్గొన్నారు.

టి.సిరసపల్లిలో 'సుపరిపాలనలో తొలి అడుగు '

మునగపాక: స్వచ్ఛమైన పాలనను సీఎం చంద్రబాబునాయుడు అందిస్తున్నారని టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు పేర్కొన్నారు. మండలంలో టి.సిరసపల్లిలో బుధవారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్, నాయకులు కర్రి సాయికృష్ణ, కార్పొరేషన్ డైరెక్టర్లు భీమరశెట్టి శ్రీను, నాగభూషణం, పాల్గొన్నారు.

సెక్యూరిటీ సిబ్బందితో ఆత్మీయ సమావేశం

అచ్యుతాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బ్రాండిక్స్ ఇండియా అపెరల్ పార్క్‌లో విధులు నిర్వహిస్తున్న సుమారు 200 సెక్యూరిటీ సిబ్బందితో బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరస్వామి బుధవారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. సిబ్బంది యోగక్షేమాలు, వృత్తి, సంక్షేమ వసతులు అడిగి తెలుసుకున్నారు. విధుల్లో మానసిక ఒత్తిడి లేకుండా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పరిపాలనా విభాగం ప్రతినిధులు శ్రీరామ్. నాయుడు, రాజు, రఘు, సెక్యూరిటీ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ పూజలు

మునగపాక, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో తోటాడలో ఆదినారాయణస్వామి రాజయోగాశ్రమం ట్రస్టు ఆధ్వర్యంలోను, వాడ్రాపల్లిలో గ్రామ పెద్దలు ఆధ్యాత్మిక ధర్మ ప్రచారకర్తలు ఆధ్వర్యంలో బుధవారం గిరిప్రదక్షిణ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రదర్శనలో పాల్గొనేందుకు భక్తులు ఆసక్తి చూపారు. ఆధ్యాత్మిక గీతాలు ఆలపిస్తూ గిరి ప్రదక్షిణలు చేశారు. పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా నడక సాగించారు.

ఎలమంచిలి చేరుకున్న అయోధ్య బాలరాముని పాదుకలు

ఎలమంచిలి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అయోధ్య నుంచి బాల రాముని పాదుకలు బుధవారం పట్టణంలోని తులసీనగర్‌లోని సీతారాముల ఆలయానికి చేరుకున్నాయి. స్థానికులు పెద్ద సంఖ్యలో చేరుకుని ఈ పాదుకలను దర్శించుకున్నారు.

గిరి ప్రదర్శన భక్తులకు ఎమ్మెల్యే అల్పాహారం పంపిణీ

అచ్యుతాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలో గిరి ప్రదర్శన చేస్తున్న భక్తులకు ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ బుధవారం అల్పాహారాన్ని అందజేశారు. విశాఖలోని తెన్నేటి పార్కువద్ద ప్రత్యేకంగా స్టాల్‌ని ఏర్పాటుచేసి భక్తులకు సమోసా, బ్రెడ్, టీని అందజేశారు. ఈకార్యక్రమంలో జనసేన రాజకీయ వ్యవహారాల ప్రతినిధి సుందరపు సతీష్ కుమార్‌తో పాటు కుటుంబ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఎలమంచిలి పట్టణంలో ర్యాలీ చేస్తున్న కార్మిక సంఘాలు



అచ్యుతాపురంలో మానవహారం

సార్వత్రిక సమ్మె ప్రశాంతం, పాక్షికం

ఎలమంచిలి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా బుధవారం పట్టణంలో బంద్ పాక్షికంగా ప్రశాంతంగా సాగింది. బస్సులు, ఆటోలు యథావిధిగా రాకపోకలు సాగించాయి. పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు ఆటంకంలేకుండా తెరుచుకున్నాయి. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రధాన రోడ్డుపై మునిపల్ వివిధ కార్మిక సంఘాలు భారీ ర్యాలీ నిర్వహించారు. మునిసిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేవారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు గనిశెట్టి ఏసుదాసు మాట్లాడుతూ మునిసిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో, మోటారు తదితర కార్మిక సంఘాల ప్రతినిదులు నూకరాజు, వెంకటరమణ, మహేశ్, సూరిబాబు, పవన్, శ్రీనివాసరావు కార్మికులు పాల్గొన్నారు. ప్రధాన రోడ్డుపై సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ, మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. సీఐటీయూ నేత శివాజీ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, పీఏసీఎస్‌ల సంఘం జిల్లా కార్యదర్శి శివరామ కృష్ణ పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

రాంబిల్లి: కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. బుధవారం కార్మికులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం, నేవే ప్రధాన గేటు వద్ద రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ నేత చందక రామ కృష్ణ, ఐద్వా నేత మంగాతాయారు, నాయకులు ఎం. నారాయణరావు, కాశియ్య, భాస్కరరావు, కార్మికులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో

అచ్యుతాపురం: కార్మికుల హక్కులు ప్రధాని మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా మారుస్తుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము ఆరోపించారు. అచ్యుతాపురంలో ర్యాలీతో పాటు మానవ హారాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రి అప్పారావు, రామసదాశివరావు, విశ్వేశ్వరరావు, నారాయణమ్మ, లావణ్య, రమణ, మంగమ్మ, సత్తిబాబు. పాల్గొన్నారు.

మునగపాక: కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు కె.ఈశ్వరరావు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్నభోజనం, వీవోఏ, వీఆర్ఏలు, సీపీఎం నాయకులు ఆళ్ళ మహేశ్వరరావు, ఎస్.బ్రహ్మాజీ పాల్గొన్నారు.

రోజు కూలీకి విద్యుత్ బిల్లు రూ. 8 వేలు!



విద్యుత్ బిల్లు చూపుతున్న నరసింగరావు

అచ్యుతాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఓ దినసరి కూలీకి విద్యుత్ బిల్లు రూ. 8175 వచ్చింది. దీంతో అతను లబోదిబోమంటున్నాడు. వెదురువాడకు చెందిన వియ్యపు నరసింగరావు దినసరి కూలీ. అతని ఇంటి సర్వీస్ నంబరు 575. ప్రతి రోజు కుటుంబంతో ఉదయం కూలిపనికి వెళ్లి సాయంత్రం ఇంటికి వస్తారు. రాత్రికి ఫ్యాన్, లైటు వాడుతారు. అలాంటి ఈ కుటుంబానికి ఈ నెల రూ. 8175 బిల్లు వచ్చింది. ఈ పూర్తి బిల్లు కట్టాల్సిందేనని, లేకుంటే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ సిబ్బంది చెబుతున్నట్టు నరసింగరావు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని నరసింగరావు కోరుతున్నాడు.

హెరిటేజ్ పాడిరైతులకు బోనస్ రూ.3.26 కోట్లు

అచ్యుతాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు ఏరువాక బోనస్ కింద రూ.3.26 కోట్లు విడుదల చేశామని హెరిటేజ్ జోనల్ మేనేజర్ వి. దివాకర రావు తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. పాడి రైతులందరికీ ఆరు నెలల బోనస్‌ని బ్యాంకు ఖాతాలకు నేరుగా జమచేస్తామన్నారు. రుణాలు మంజూరు చేస్తామన్నారు. బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ పి తులసి నాయుడు, ఏరియా మేనేజర్ మనోహర్, మేనేజర్ కూండ్రపు శేషు రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదువరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఈఈ కె. రాజశేఖర్ తెలిపారు. కొండకర్ల జంక్షన్, ఎర్రవరం, ఉప్పవరం, మల్లవరం, నరేంద్రపురం, ఎంజేపురంల వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

జనవాణి వినతులు సత్వరమే పరిష్కరించాలి: ఎమ్మెల్యే సుందరపు



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయ్ కుమార్

ఎలమంచిలి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జనవాణిలో ప్రజల నుంచి వచ్చిన వినతులకు సత్వరమే పరిష్కారం చేయాలని ఎమ్మెల్యే విజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని జడ్పీ అతిథి గృహం ఆవరణలో నియోజకవర్గ స్థాయి జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను ఎమ్మెల్యే ఓపిగా విన్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అలాగే, వినతులు రూపంలో వచ్చిన 130 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో కూటమి నేతలు బొద్దపు శ్రీను, లవుడు లోవరాజు, ఊటకూటి రమేశ్, కొఠారు శ్రీను మాస్టారు, గుర్రాల శేఖర్, కర్రి ఝాన్సీ, పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు నియామక పత్రాలు

అలాగే, కొత్తగా ఎంపికైన అంగన్‌వాడీ కార్యకర్త, 6 గురు ఆయాలకు ఎమ్మెల్యే నియామక పత్రాలు అందజేశారు. అనంతరం మునిసిపాలిటీలోని ధర్మవరం వార్డులో ఎమ్మెల్యే పర్యటించారు. వృద్ధురాలు ఎం. వరహాలమ్మకు సాంకేతిక లోపంతో పెన్షన్ రావడం లేదని తెలుసుకుని, ఎమ్మెల్యే సొంత నిధులు రూ. 5 వేలు అందించారు. అలాగే, పెన్షన్ మంజూరు చేయాలని మునిసిపల్ కమిషనర్ ప్రసాద రాజుకు ఆదేశించారు.



జోషి, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌లను సన్మానిస్తున్న ట్రైలర్స్ అసోసియేషన్ నేత సత్యనారాయణ తదితరులు

బీజేపీ జాతీయ నేత జోషికి ఘనంగా సత్కారం

ఎలమంచిలి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ నాయకులు జోషిని బుధవారం మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్, తదితరులు సత్కరించారు. జోషి విశాఖలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ఆడారి ఆనంద్‌తో కలిసి ఎలమంచిలిలోని చైర్‌పర్సన్ రమాకుమారి నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ట్రైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి వియ్యపు సత్యన్నారాయణ తదితరులంతా కలిసి జోషి, ఆడారి ఆనంద్‌లను కలిసి ఘనంగా సత్కరించారు. స్థానిక నేతలు పెద్ద సంఖ్యలో జోషిని కలిశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆడారి శ్రీదర్, శంకరరావు, సూరిశెట్టి సూర్య, మద్దాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా బొత్స పుట్టిన రోజు వేడుకలు

ఎలమంచిలి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పుట్టిన రోజు వేడుకలను బుధవారం ఎలమంచిలిలో ఎంపీపీ బోదెపు గోవింద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, మునిసిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా పార్టీ నేతలు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా బొత్స సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, వైసీపీ నేతలు దాసరి కుమార్, కొఠారు కొండబాబు, పిట్టా సత్తిబాబు, పిల్లా త్రినాద్, రాపేటి సంతోశ్, కొల్లి త్రినాధ్, సర్పంచ్ మర్రి రాజులు పాల్గొన్నారు.

106 మందికి కంటి వైద్య పరీక్షలు

మునగపాక, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో చూచుకొండ గ్రామంలో శ్రీషిర్డీసాయిబాబా ఆలయం ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసి 106 మందికి పరీక్షలు నిర్వహించినట్టు నిర్వాహకుడు అశ్వని కుమార్ తెలిపారు. వీరిలో వైద్య నిపుణురలు దుర్గాభవాని 22 మందిని కంటి ఆపరేషన్‌కు గుర్తించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, క్యాంపు మేనేజర్ ఎం.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

అచ్యుతాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి):, తమ సంఘం మత్స్య కారుడు ఎర్రయ్య కుటుంబానికి అండగా ఉంటుందని జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోస అప్పల రాజు అన్నారు. ఇటీవల చేపల వేటకు వెళ్లి గల్లంతైన పూడిమడక శివారు కొండపాలెంకి చెందిన చోడిపల్లి ఎర్రయ్య కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించారు. ప్రభుత్వ పరంగా సాయమందించేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఒరుపుల శంకర్, మత్స్యకార నాయకులు ఉమ్మిడి అప్పారావు, ఎరిపిల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపుల భర్త అరెస్టు

అచ్యుతాపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వేధింపులతో భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తను బుధవారం అరెస్టుచేసినట్టు స్థానిక ఎస్ఐ సుధాకర రావు తెలిపారు. రాంబిల్లి మండలం లాలం కోడూరుకి చెందిన నిందితుడు రుత్తల శ్రీను, భార్య వేమలక్ష్మి, కుమారుడు హేమవర్ధన్, కుమార్తె లోహితతో అచ్యుతాపురం మండలం భోగాపురం వద్ద గల ఒక అపార్టుమెంట్‌లో కాపురముంటున్నారు. శ్రీను అచ్యుతాపురంలో ఫొటో స్టూడియో నడుపుతున్నాడు. అతను భార్యను వేధింపులకు పాల్పడడంతో ఈనెల 6వతేదీన గడ్డిమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించారు. బంధువులు ఆమెను విశాఖలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి వెంకట రమణ పిర్యాదు మేరకు శ్రీనుని బుధవారం అరెస్టుచేసి రిమాండ్‌కి తరలించామని ఎస్ఐ తెలిపారు.

నేడు చినదొడ్డిగల్లులో సత్తెమ్మతల్లి జాతర

నక్కపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డి గల్లులో సత్తెమ్మతల్లి జాతర గురువారం ఘనంగా నిర్వహించనున్నారు. ఉత్సవ ప్రధాన నిర్వాహకుడు నడింపల్లి సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఉత్సవం కోసం విస్తృత ఏర్పాట్లు చేపట్టారు

గురుపౌర్ణమికి సిద్ధమైన ఆలయాలు

అచ్యుతాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమికి అచ్యుతాపురంలో ఎలమంచిలి రోడ్డు, సెజ్ పునరావాస కాలనీ, మల్లవరంలలోని సాయిబాబా ఆలయాలు సిద్ధమయ్యాయి. గురువారం తెల్లవారు జామునుంచి పత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆలయాలను వచ్చిన భక్తులకు మంచినీరు. మజ్జిగ, పులిహోర ఉచితంగా పంపిణీ చేయటానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధనలుంటాయి.

గర్భిణులకు పోషకాహారం పంపిణీ

పాయకరావుపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పీహెచ్‌సీలో బుధవారం పాయకరావుపేట వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులకు పోషకాహారం పంపిణీ చేశారు. ప్రతీ నెల 9న ఈ పీహెచ్‌సీకి వైద్య పరీక్షలకు వస్తున్న గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో దాత మండ అయ్యన్న, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి పథకం సామాజిక తనిఖీలో లోపాలు ఉండరాదు'

మునగపాక, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంనకు సంబంధించి సమాజిక తనిఖీలో లోపాలు ఉండకూడదని సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు పేర్కొన్నారు.వాడ్రాపల్లి సచివాలయం వద్ద బుధవారం సామాజిక తనిఖీ గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఇటీవల బదిలీ అయిన ఐదుగురు సచివాలయ సిబ్బందికి సన్మానించారు.

తెప్ప బోల్తాపడి మత్స్యకారుడు మృతి



మేరుగు అర్జున్ (ఫైల్)

పాయకరావుపేట రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటనగరం తీరంలో తెప్ప బోల్తాపడిన ఘటనలో తీవ్ర గాయాలపాలైన మత్స్యకారుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఇందుకు సంబంధించి మృతుడి బంధువులు తెలిపిన వివరాలివి. వెంకటనగరం గ్రామానికి చెందిన మేరుగు అర్జున్ (38) సముద్రంలో వేట సాగిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుండేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం తెప్పపై సముద్రంలో చేపల వేటకు వెళ్లి, సాయంత్రం తిరిగి ఒడ్డుకి వస్తుండగా ఒక్కసారిగా వచ్చిన భారీ అలలకు తెప్ప బోల్తాపడింది. దీంతో అర్జున్ కూడా తెప్పకింద ఉండిపోయి నలిగిపోయాడు. ఇది గుర్తించిన తోటి మత్స్యకారులు అర్జున్‌ను బయటకు తీసి తునిలోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం బుధవారం కాకినాడ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ ఘటనపై పాయకరావుపేట పోలీసులకు మృతుడి బంధువులు ఫిర్యాదు చేశారు. కాగా అర్జున్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నా రు. భార్య తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. కుటుంబాన్ని పోషించే వ్యక్తి మృతిచెందడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని బంధువులు కోరుతున్నారు.

'పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం'



సపరిపాలనలో ఏడాది కరపత్రాలతో టీడీపీ కార్యకర్తలు, ప్రజలు

పాయకరావుపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పేదల సంక్షేమమే లక్ష్యంగా ఎన్నో పథకాలను కూటమి ప్రభుత్వం అమలుచేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు తెలిపారు. స్థానిక దుర్గానగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల కరపత్రాలను అందజేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పెదిరెడ్డి చిట్టిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షే మ కార్యక్రమాల అమలుకు ప్రభుత్వం కృషిచే స్తోందన్నారు.

పాడిరైతులకు అభివృద్ధి కూటమి అజెండా

కోటవురట్ల: పాడిపరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వ అధిక ప్రాధాన్యం ఇస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు పెట్ల లింగం నాయుడు అన్నారు. బీకేపల్లిలో రైతులకు పాములవాక పశు వైద్యాధికారి హరిప్రియ పశుగ్రాసంపై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో లింగం నాయుడు మాట్లాడుతూ పశు గ్రాసం పెంపునకు ప్రభు త్వం రాయితీ పై విత్తనాలు సరఫరాచేస్తోందని అన్నారు. పాడిరైతులు ప్రభుత్వ రాయితీలు సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమను ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని అన్నారు.

పేరెంట్, టీచర్ మీట్‌కు బడులు ముస్తాబు



పాఠశాలను అలంకరిస్తున్న విద్యార్థులు

నక్కపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న పాఠశాలలను మెగా పేరెంట్, టీచర్ సమావేశానికి ముస్తా బు చేశారు. గురువారం ఉదయం నుంచి మెగా పీటీఎం 2.0 కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఇప్పటికే చాలా గ్రామాల్లో తల్లిదండ్రులు, గ్రామ పెద్దలకు పాఠశాల యాజమాన్యాలు ఆహ్వానాలు పంపాయి. పండుగ వాతావరణంలో కార్యక్రమాన్ని జరిపే విధంగా అన్ని పాఠశాలల్లో పోటా పోటీగా ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ సందర్భంగా మండలంలోని పలు పాఠ శాలలను సందరంగా తీర్చిదిద్దుతున్నారు. తల్లిదం డ్రులకు స్వాగతం పలికేందుకు పలు పాఠశాలల్లో స్వాగతం బోర్డులను తయారు చేశారు.

దిగ్విజయంగా కార్మిక సమ్మె

నక్కపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కార్మిక సమ్మెను నిర్వహించారు. ముందుగా నూకాలమ్మ ఆలయం నుంచి కార్మికులు నక్కపల్లి హైవే మీదుగా పీఏసీఎస్ వరకూ ర్యాలీ చేశారు. ఏపీ రైతు సంఘం, సీఐటీయూ, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం. దుర్గారాణి నేతృత్వంలో ఆందోళన చేపట్టారు. కార్మిక చట్టాలకు సంకెళ్లు వేశారంటూ చేసిన కళా ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. మెడకు ఉరితాడు తగిలించుకుని రైతులు నిరసన తెలిపారు. కార్మికుల శ్రమను దోపిడీ చేసేందుకు కేంద్రం 44 కార్మికచట్టాలను రద్దు చేసిందని నిరసనగా ర్యాలీ చేపట్టారు.

కోటవురట్ల, (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్కీం వర్కర్లు, అంగన్ వాడి, ఆశ కార్యకర్తలు బుధవారం కోటవురట్లలో ఆందోళన చేశారు. కార్మిక ఉద్యోగ సంఘాల పిలుపు మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ నెలకు రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ వ్యవస్థలను రద్దు చయాలన్నారు.

పంచాయతీ అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

▸▸ 2030 నాటికి పూర్తికి ఎంపీడీవో సూచన

కోటవురట్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పంచాయతీ అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయి సిబ్బందికి పంచాయతీ అభివృద్ధి లక్ష్యాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా పేదరికంలేని సమాజం, క్లీన్‌అండ్ గ్రీన్, చిల్డ్రన్ ఫ్రెండ్‌షిప్, ఉమెన్‌ఫ్రెండ్ షిప్, తాగునీరు తదితర 9అంశాలపై శిక్షణ ఇచ్చారు. పంచాయతీ అభివృద్ధి సూచక ప్రకారం సంబంధిత అధికారులు ఈ లక్ష్యాలను 2030 నాటికి పూర్తి చేయాలన్నారు. అందుకు అనుగుణంగాప్రణాళికలను రూపొందించాలన్నారు.

అనుమతులు లేని గ్రావెల్ పట్టివేత

నక్కపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జానకయ్యపేట గ్రామానికి సమీపంలో హెటిరో రోడ్డులో అనుమతులు లేకుండా తరలిస్తున్న గ్రావెల్ ట్రాక్టర్లను బుధవారం ఉదయం పట్టుకున్నట్టు సీఐ కె. కుమారస్వామి తెలిపారు. తదుపరి చర్యలు నిమిత్తం తహశీల్దార్‌కు సమాచారం అందజేశామని తెలిపారు.

అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంటాయి

▸▸ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజా

పాయకరావుపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయంలో పాఠకులకు కావల్సిన అన్ని పుస్తకాలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి. కుమార్‌రాజా తెలిపారు. బుధవారం స్థానిక గ్రంథాలయంలో ఆయన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయం లో అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని, వాటి ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నక్కపల్లి రూరల్ సర్కిల్ కార్యాలయానికి హోం మంత్రి, ఎస్పీ

ఎస్. రాయవరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అడ్డరోడ్డులో ఉన్న నక్కపల్లి రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని గురువారం హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా ఎస్పీ తూహిన్ సిన్హా సందర్శించనున్నారని సీఐ రామకృష్ణ బుధవారం తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో పలు చోట్ల నూతనంగా ఏర్పాటు చేసిన సర్వేలెన్స్ కెమెరాలకు చెందిన కంట్రోల్ రూంతోపాటు పోలీసులకు నూతన ఈవీ బైకుల ప్రారంభోత్సవంలో హోం మంత్రి పాల్గొనున్నారు.

కో- ఆపరేటివ్ బ్యాంక్‌కు నూతన చైర్మన్‌గా పవన్‌కుమార్



చైర్మన్ పవన్‌కుమార్‌కు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న జ్యోతికుమార్

ఎస్. రాయవరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పెనుగొల్లు కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్‌గా వమ్మవరం గ్రామానికి చెందిన రెడ్డి పవన్ కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్‌కు జనసేన యూత్ ప్రెసిడెంట్ లింగంపల్లి జ్యోతికుమార్‌తో పాటు పలువురు కూటమి శ్రేణులు ఆయన్ను బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఊరూర 'పొలం పిలుస్తోంది'



పొలం పిలుస్తోందిలో సైతారు పేట గ్రామస్థులు

ఎస్. రాయవరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సైతారుపేట గ్రామంలో బుధవారం ఏవో సౌజ న్య ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువుల వినియోగం, ప్రాము ఖ్యత, వాటిని తయారు చేసే విధానాన్ని రైతులకు ఏవో సౌజన్య అవగాహన కల్పించారు.

పాయకరావుపేట రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదటం, పాల్మన్‌పేట గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భ ంగా ఏవో ఆదినారాయణ భూములను పరిశీలించి ఖరీఫ్ నారుమడి, పంట నమోదు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. వీహెచ్‌ఏలు ప్రియాంక, గోపీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

మునగపాక: వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలు పాటించడం సాగులో మంచి ఫలితాలు పొందవచ్చునని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ సహాయ సంచాలకులు సిహెచ్.సుబ్రహ్మణ్యం సూచించారు. మండలంలో నాగవరం, మల్లవరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో ఆర్‌జీఎల్-2537 రకానికి బదులుతో కొత్తరకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త భవాని, ఏవో జ్యోత్స్నకుమారి, రైతులు పాల్గొన్నారు.

దేమునిగుమ్మంలో శ్రీవారికి ప్రత్యేక అభిషేకాలు


ఉత్సవమూర్తులకు అభిషేకాలు జరుపుతున్న అర్చకులు

అనకాపల్లి టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి పవిత్రోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఉత్సవమూర్తులకు ప్రధానార్చకులు పులఖండం విజయబాబు, గిరిబాబు ఆలయ మండపంలో పంచామృతాభిషేకాలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అన్నమయ్య అమృతవర్షిణి సభ్యుల కోలాటం, ఆలపించిన సంకీర్తనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో బి.మురళీకృష్ణ, మాజీ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'సాగులో ఆధునిక పద్ధతులతో మేలు'


ఆధునిక యంత్రంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

తుమ్మపాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అలవర్చుకుంటే ఎంతో మేలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సీహెచ్.సుబ్రహ్మణ్యం అన్నారు. బవులవాడలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ నారుమడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వరి పంట వేసే ముందు విత్తన శుద్ధి చేయాలని, ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి రంగాచారి మాట్లాడుతూ సాగులో రైతులంతా యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. అనంతరం వరినాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ ఏటీఎం రామకృష్ణ, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

భారీ వాహనాల రాకపోకల నిషేధానికి వినతి

పరవాడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం జంక్షన్ నుంచి పరవాడ బొంకుల దిబ్బవీధి మీదుగా భారీ వాహనాల రాకపోకలను నిషేధించాలని బొంకులదిబ్బ యూత్ ప్రతినిధులు చీపురుపల్లి శ్రీనివాసరావు, పైలా పైడంనాయుడు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. భారీ వాహనాల రాకపోకల వల్ల రహదారికి ఇరువైపులా నివాసం ఉంటున్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఇటుగా భారీ వాహనాలకు అనుమతులు లేనప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమస్యపై వెంటనే పోలీస్, రవాణా శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

రోడ్డు భద్రతపై అవగాహన తప్పనిసరి



రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రామచంద్రరరావు

సబ్బవరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీఐ జి.రామచంద్రరావు సూచించారు. ఇక్కడి రేంజర్స్ డిఫెన్స్ అకాడమీలో బుధవారం విద్యార్థులకు రోడ్డు భద్రతపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ద్విచక్రవాహనాలపై హెల్మెట్ ధరించకుండా ప్రయాణించడం, లైసెన్స్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడపడం, సీటు బెల్టు ధరించకుండా డ్రైవింగ్ చేయడం వంటి వాటివల్ల ప్రమాదాలకు ఆస్కారం ఉందన్నారు. వీటిపై విద్యార్థులు తమ తల్లిదండ్రులతో పాటు చుట్టుపక్కల వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో అకాడమీ చైర్మన్ పోతల సత్యనారాయణ, జయభాస్కర్, సిబ్బంది, పాల్గొన్నారు.

డెంగ్యూపై గవరపాలెంలో అవగాహన ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

అనకాపల్లి టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 80వ వార్డు దేముడు తోట ప్రాంతంలో బుధవారం డెంగ్యూపై వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గవరపాలెం యూపీహెచ్‌ఎస్ వైద్యాధికారి డాక్టర్ జయదీప్ ఆ ప్రాంత ప్రజలకు డెంగ్యూ జ్వరాలు సోకడానికి కారణంగా, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు బీఎస్ఎంకే జోగినాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కూటమి నాయకులు బొడ్డేడ మురళీ, సూరిశెట్టి రాముడు, సూరిశెట్టి శ్రీనివాసరావు, పెంటకోట మధు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కొప్పాకలోని పలు షాపుల్లో పోలీసుల తనిఖీలు


కొప్పాక హైస్కూలు సమీపంలో ఉన్న పాన్‌షాపులో ఎస్ఐ తనిఖీలు

కొత్తూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కొప్పాక హైస్కూల్ సమీపంలో ఉన్న పాన్ షాపులను రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ సిబ్బందితో కలిసి బుధవారం తనిఖీ చేశారు. పాన్‌షాపుల్లో, కిరాణా షాపుల్లో గుట్కా, పాన్ మసాలాలు, ఇతర మాదక ద్రవ్యాలు విక్రయాలు చేయరాదని ఆయా వ్యాపారులకు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

84వ వార్డులో జీవీఎంసీ ఎస్ఈ పర్యటన

అనకాపల్లి టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి 84వ వార్డు లక్ష్మీనారాయణ నగర్, రింగురోడ్డు ప్రాంతాల్లో జీవీఎంసీ ఎస్ఈ శ్రీనివాసరావు బుధవారం పర్యటించారు. డ్రైనేజీని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కోట్నివీధి నుంచి రింగురోడ్డు జంక్షన్ వరకు ఉన్న ప్రధాన కాలువను అభివృద్ధిపరచాలని, దోమల బెడదను నివారించాలని కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లితో పాటు వార్డు టీడీపీ ఇన్‌చార్జి మాదంశెట్టి నీలబాబు కోరారు. ఎస్ఈ వెంట ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఉన్నారు.

కదంతొక్కిన కార్మికులు

▸ అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో ప్రశాంతంగా సార్వత్రిక సమ్మె ▸ లేబర్‌కోడ్స్ రద్దుకు వివిధ సంఘాల ప్రతినిధుల డిమాండ్



అనకాపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు, కార్మిక సంఘ నాయకులు



పరవాడ మండల పరిషత్ జంక్షన్ నుంచి ర్యాలీగా వెళ్తున్న స్కీం వర్కర్లు

అనకాపల్లి టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్త బుధవారం చేపట్టిన సమ్మె అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో ప్రశాంతంగా జరిగింది. అనకాపల్లి పట్టణంలోని ముఠా కార్మికులు, అంగన్‌వాడీ, జీవీఎంసీ, బేవరేజెస్, స్కూళ్ల స్వీపర్లు, వీవోఏలు, ఆర్ఏఆర్ఎస్ కార్మికులు, పంచాయతీ కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళనలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తొలుత సీఐటీయూ కార్యాలయం నుంచి భారీ ప్రదర్శన నిర్వహించారు. నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడిన అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.లోకనాథం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ కార్మికవర్గానికి నష్టం కలిగిస్తున్నాయన్నారు. పారిశ్రామికవేత్తల కోసం కేంద్ర ప్రభుత్వం ఈ లేబర్‌కోడ్స్‌ను తీసుకువచ్చిందని ఆరోపించారు. స్కీమ్‌ల్లో పనిచేస్తున్న ఆశ, అంగన్‌వాడీ, మిడ్ డే మీల్స్, వీవోఏలు, పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, రైతు కూలీ సంఘం కార్యదర్శి కె.మోహన్, ఏఐఎఫ్‌టీయూ కార్యదర్శి రాంబాబు, పలు కార్మికసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అనకాపల్లి యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కాండ్రేగుల హరికృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా సంస్థలను బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శరగడం శ్రీనివాసరావు, జగదీష్, డి.శ్రీనివాస్, శ్రీధర్, తోట శ్రీనివాసరావు, మాలతి, లక్ష్మి పాల్గొన్నారు. ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ఉద్యోగులు, కార్మికులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. విద్యుత్ యూనియన్ జేఏసీ నాయకులు అనకాపల్లి నూకరాజు, పి.చంద్రశేఖర్, సోమన్నదొర, ఎల్.నూకరాజు తదితరులు పాల్గొన్నారు. ఆర్టీసీ కార్మికులు కూడా డిపో వద్ద ధర్నా చేపట్టారు.

కొత్తూరులో...

కొత్తూరు : సార్వత్రిక సమ్మెలో భాగంగా అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు ఆందోళన చేట్టారు. ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వై.ఎస్.భద్రం మాట్లాడుతూ కార్మికుల పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించి కార్మిక హక్కులను దేశ ప్రధాని మోడీ ప్రభుత్వం హరిస్తుందని మండిపడ్డారు. కార్మిక నాయకులు కలిగొట్ల నాయుడు, చెవ్వేటి నేస్తాలు, కారు సత్తిబాబు, చేతల లక్ష్మి, పెదపూడి జయలక్ష్మి, సూరిబాబు, నాగేష్, ఏఐటీయూసీ నాయకులు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాలలో...

తుమ్మపాల : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా యూనియన్ నాయకులతో కలిసి పట్టణంలోని మెయిన్‌రోడ్డుపై ర్యాలీ నిర్వహించారు. కార్మిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మాకిరెడ్డి రామునాయుడు, ఏఐటీయూసీ నాయకులు త్రినాథ్, వీరభద్రరావు, చైతన్య, వియ్యపు రాజు, కోరుబిల్లి శంకరరావు, పోతురాజు, ఫణీంద్రకుమార్, బాబ్జి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పరవాడలో...

పరవాడ : కార్మిక సంఘాల పిలుపునిచ్చిన సమ్మె పరవాడ ప్రాంతంలో ప్రశాంతంగా జరిగింది. సీఐటీయూ ఆధ్వర్యంలో స్కీం వర్కర్లు భారీ ర్యాలీ చేపట్టిన అనంతరం పరవాడ బంగ్లా జంక్షన్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ స్కీం వర్కర్లను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు వీవీ రమణ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు రత్నం, ఆశ యూనియన్ నాయకురాలు ఎ.వరలక్ష్మి, వెన్నెల లక్ష్మి, మధ్యాహ్న భోజన పథకం యూనియన్ నాయకురాలు కె.విమల, డ్వాక్రా వీవోఏల యూనియన్ నాయకురాలు వెంకటలక్ష్మి, ముఠా యూనియన్ నాయకులు సన్నిబాబు, గేదెల అప్పారావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, సింహాద్రి ఎన్టీపీసీ కార్మికులతో కలిసి సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కె.బాల సూర్యారావు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసే చర్యలు విరమించాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాల మార్పులను కార్మికులంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్మికులంతా విధులను బహిష్కరించి నిరసనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు పీవీ నాయుడు, ఐఎన్‌టీయూసీ నాయకుడు పెంటారావు, ఎన్టీపీసీ కార్మిక సంఘం నాయకులు రామారావు, గోవిందరాజు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

కశింకోటలో...

కశింకోట : దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కశింకోటలో సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు తనూజ, ఎం.శ్రీదేవి, ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి.వరలక్ష్మి, సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తీరును ఎండట్టారు. కార్మికులకు నష్టం కలిగించే విధానాలను మోదీ విడనాడాలని డిమాండ్ చేశారు. ముందుగా సంతబయలు నుంచి ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, మధ్యాహ్న భోజన పథకం, ముఠా కార్మికులు, పంచాయతీ కార్మికులు ర్యాలీగా బయలుదేరి పొట్టి శ్రీరాములు పార్కుగుండా జాతీయ రహదారిపై నినాదాలు చేస్తూ తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకునివినతిపత్రం అందజేశారు.

సబ్బవరంలో...

సబ్బవరం : సార్వత్రిక సమ్మె సబ్బవరంలో ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం, ఆశా కార్యకర్తలతో పాటు వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు స్థానిక దుర్గామాంబ ఆలయం నుంచి ఎన్టీఆర్ జంక్షన్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ చిన్నికృష్ణకు వినతి పత్రాన్ని అందజేసిన అనంతరం సీఐటీయూ మండల నాయకులు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికవర్గానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటుందని ఆరోపించారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనాలు రూ. 26 వేలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తోపుడు బండ్ల కార్మిక సంఘం అధ్యక్షుడు ఎం.గౌరీసు, వివిధ సంఘాల నాయకులు కె.అరుణ, జి.వరలక్ష్మి, వీవీ రమణమ్మ, బి.రమణమ్మ, ఎం.వరలక్ష్మి, ఎస్.గౌరీ, భవానీ, శ్రీకాంత్, పుష్పాదేవి, ఎస్.జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి

కశింకోట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోమవరం గ్రామంలో పారిశుధ్య పనులను ఎంపీడీవో వి.వి.రవికుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది పలు సూచనలు చేశారు. ప్రస్తుతం వర్షా కాలం కావడంతో వీధుల్లో, కాలువల్లో చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. అలాగే, గ్రామస్థులు ఇంటింటికీ వచ్చే పారిశుధ్య సిబ్బందికి తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఎస్.సత్యారావు ఉన్నారు.

'బుద్ధుని బోధనలు అనుసరణీయం'


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ సత్యవతి

తుమ్మపాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో గల అంబేడ్కర్ భవనంలో ఈ నెల 27న జరగనున్న 'బుద్ధునితో నా ప్రయాణం' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఇక్కడ మాజీ ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బుద్ధుని బోధనల అనుసరణ ద్వారా ముక్తి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ సంఘాల ప్రతినిధులు బల్లా నాగభూషణం, పి.బాబ్జి, బత్తుల గౌతం బాబు, జాన్‌బాబు, నూకరాజు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు పలు ప్రాంతాల్లో అంతరాయం రేపు

అనకాపల్లి టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గాంధీమార్కెట్ ఫీడర్ పరిధిలో విద్యుత్ నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ తెలిపారు. పార్కు సెంటర్ ఏరియా, గౌరీ సంఘం ఏరియా, సతకంపట్టు ఏరియా, సంతోషి మాత ఆలయం ఏరియా, రింగురోడ్డు ఏరియా నుంచి బాలకృష్ణ బస్టాప్ ఏరియా, రైతు భారతి కల్యాణ మండపం ఏరియా, దాడి భోగలింగం స్కూల్ ఏరియా, అలాగే నూకాంబిక ఆలయం ఏరియా, చాకలిపేట, ఇందిరమ్మకాలనీ, రాణిగారి పూలతోట, ఇండోర్ స్టేడియం, అగ్గిమర్రిచెట్టు, కోటవీధి ప్రాంతాల్లో ఆ రోజు ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

చెట్టును ఢీకొన్న ఆటో

▸ మూగ యువతి మృతి

▸ మరో ముగ్గురు దివ్యాంగులకు స్వల్ప గాయాలు


సంఘటనా స్థలంలో మృతి చెందిన శాంతి, గాయపడిన వారిని ఆస్పత్రికి తరలింపు

సబ్బవరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పినగాడి- కె.కోటపాడు రోడ్డులో గల అయ్యన్నపాలెం ఎస్సీ కాలనీ వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మూగ యువతి మృతి చెందగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం తట్టవలస గ్రామానికి చెందిన సారా శాంతి (22), పరవాడ మండలం దళాయపాలేనికి చెందిన సీహెచ్.నరేంద్ర, విజయనగరానికి చెందిన కె.రాజ్యలక్ష్మి, కె.ధనలక్ష్మి, సబ్బవరం మండలం మొగలిపురానికి చెందిన ఎం.అనంతకుమార్ వీరంతా దివ్యాంగులు (మూగ, చెవిటి). వీరు ఐదుగురు విశాఖలోని మురళీనగర్‌లో గల గ్రోత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కిల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్నారు. సింహాచలం గిరి ప్రదక్షిణకు అని బుధవారం ఇన్‌స్టిట్యూట్‌లో చెప్పి ఆటోలో బయల్దేరారు. సబ్బవరం మండలం అయ్యన్నపాలెం మీదగా విశాఖకు తాగునీరు వెళుతున్న రైవాడ కాలువలో స్నానాలు చేశారు. తిరిగి గిరి ప్రదక్షిణకు వెళుతుండగా, అయ్యన్నపాలెం ఎస్సీ కాలనీ వద్ద కు వచ్చే సరికి రోడ్డు దాటుతున్న పాము కనిపించింది. దీంతో ఆటో డ్రైవర్ కంగారు పడడంతో ఆటో ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీకొంది. ఆటోలో ఉన్న సారా శాంతి తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కె.ధనలక్ష్మి, ఎం.అనంతకుమార్, సీహెచ్. నరేంద్రలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ జి.రామచంద్రరావు తెలిపారు. కాగా, డ్రైవర్ పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

సమష్టి కృషితో గ్రామాల అభివృద్ధి

▸ వివిధ శాఖల సిబ్బంది శిక్షణ శిబిరంలో జిల్లా రిసోర్స్ పర్సన్ నాగలక్ష్మి


శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా రిసోర్స్ పర్సన్ నాగలక్ష్మి

కశింకోట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని జిల్లా రిసోర్స్ పర్సన్ నాగలక్ష్మి సూచించారు. బుధవారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది, వ్యవసాయ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులకు ఏర్పాటైన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ పనులు ఎప్పటికప్పుడు పక్కాగా జరగాలన్నారు. అలాగే పంచాయతీల్లో ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటితో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మంచి నీటి కొరత లేకుండా చూడాలని, కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వి.వి.రవికుమార్, మండల వ్యవసాయాధికారిణి స్వప్న, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ వెంకట తోటారావు, పంచాయతీ రాజ్ ఏఈ శేఖర్, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, పీహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ యశోదతో పాటు, పలు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బంధువు అంత్యక్రియలకు వచ్చి నదిలో మునిగి వ్యక్తి మృతి

▸ చోడవరం మండలం జన్నవరంలో ఘటన


నదిలో నుంచి వెలికి తీసిన మృతదేహం

చోడవరం, జూలై 9 (ఆంధ్ర జ్యోతి) : బంధువు అంత్యక్రియలకు వచ్చి నదిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలివి. చోడవరం మండలం జన్నవరంలో బంధువు మృతిచెందడంతో కె.కోటపాడు మండలం చౌడువాడ గ్రామానికి చెందిన సీహెచ్.సన్యాసిరావు(35) వచ్చేశాడు. మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకు వెళ్లడంతో వెంట వెళ్లాడు. పెద్దేరు నదిలో స్నానానికి దిగడంతో గల్లంతయ్యాడు. దీనిపై పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సమాచారం అందడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చేపట్టారు. చివరకు సన్యాసిరావు మృతిచెందడంతో మృతదేహాన్ని వెలికి తీసి బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనతో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి.

డివైడర్‌పైకి దూసుకుపోయిన లారీ

▸ తప్పిన పెను ప్రమాదం

లంకెలపాలెం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి లంకెలపాలెం మరిడిమాంబ ఆలయం వద్ద పెను ప్రమాదం తప్పింది. ఓ లారీ అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకుపోయింది. బుధవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలివి. విశాఖ నుంచి అనకాపల్లి వస్తున్న లారీ సరిగ్గా లంకెలపాలెం మరిడిమాంబ ఆలయం సమీపంలోకి వచ్చేసరికి అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకుపోయింది. ఈప్రమాదంలో లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఎలాంటి ప్రాణనష్టం జరగక పోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు క్రేన్ సాయంతో డివైడర్ పైనుంచి లారీని తొలగించారు. ఈ కారణంగా కాసేపు ట్రాఫిక్ స్తంభించింది.

షార్ట్ సర్క్యూట్‌తో టిఫిన్, పాన్ షాపులు దగ్ధం

కశింకోట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : జి.భీమవరంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా టిఫిన్ దుకాణం, పాన్‌షాపు దగ్ధమయ్యాయి. మంగళవారం రాత్రి ద్వారపురెడ్డి ఆదినారాయణ తన షాపులను మూసివేసి ఇంటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి మంటలు చెలరేగడంతో స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.50 వేల వరకు నష్ట జరిగినట్టు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాల్సిందిగా వేడుకున్నాడు.



డుంబ్రిగుడలో కార్మికసంఘాల నిరసన


పాడేరు ఐటీడీఏ ముందు బైఠాయించిన కార్మికులు


చింతపల్లిలో ర్యాలీ

నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసే వరకు పోరాటం

» వామపక్ష, ప్రజా సంఘాల నేతలు

» సార్వత్రిక సమ్మె.. ర్యాలీలు, మానవహారాలు

పాడేరురూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసేంత వరకు పోరాటాలను కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ హెచ్చరించారు. కార్మికుల సమస్యలపై చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి లింగేటి సుందరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మె విజయవంతంగా జరిగింది. సుంద్రుపుట్టునుంచి మెయిన్‌రోడ్డు, అంబేడ్కర్ కూడలి మీదుగా ఐటీడీఏ కార్యాలయం వరకు కార్మికులు భారీ ర్యాలీ చేపట్టారు. గేటు వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ కార్మికులకు 14 ఏళ్లగా కనీసవేతనాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు క్రమబద్ధీకరించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, రవాణా రంగం, భవన నిర్మాణ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమ్మెకు సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, ఏఐటీయూసీ నాయకులు సాయి శంకర్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి నాగరాజు, అంగన్వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, వివిధ సంఘాల నాయకులు చిన్నారి, దశమ్మ, అప్పారావు, అర్జున్, అప్పలనాయుడు, రత్నాలమ్మ, మాధురి, దామోదర్, సింహాచలం, విష్ణు, చంటిబాబు, పి.లక్కు, డి.బొజ్జన్న, జీవన్, కార్తీక్, వరహాలు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయలో..

అరకులోయ: అరకులోయలో పలుశాఖలలో పనిచేసే కార్మికులంతా సమ్మెలో పాల్గొన్నారు. నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు, కార్మిక హక్కులను కాపాడాలని కోరుతూ, సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మ్యూజియం ప్రధాన గేటు ఎదుట సీఐటీయూ మండల కార్యదర్శి భగత్‌రాం అధ్యక్షతన నిరసన నిర్వహించారు.ఈ ఆందోళనతో పర్యాటక కేంద్రాలు పద్మాపురం, మ్యూజియం తదితర పర్యాటక కేంద్రాలు మాతబడ్డాయి. పెట్రోల్‌బంక్‌ల్లో కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూప్రభుత్వ సంస్థలు, స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలన్నారు. ఎస్‌టీఐ యూనియన్ ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్,టూ రిజం, జీసీసీ, ఐటీడీఏ వర్కర్సు యూనియన్, అంగన్‌వాడీ, హెల్పర్సు యూనియన్, పీఏసీఎస్ సొసైటీ, పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకం యూనియన్, పంచాయతీ వర్కర్సు యూనియన్, ఆశ, ఐకేపీ, వీవోఏ వర్కర్స్ యూనియన్ నేతలు పాల్గొన్నారు.


సీలేరులో జెన్‌కో కాంట్రాక్టు కార్మికులు భారీ ర్యాలీ

జెన్‌కో కార్యాలయం వద్ద నిరసన

సీలేరు: జీకేవీధి మండలం సీలేరులో బుధవారం రాష్ట్ర విద్యుత్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు ఏపీ జెన్‌కో ఇంజనీర్లు, ఉద్యోగులు, స్థానిక సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద డివిజనల్ ఇంజనీర్ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తంచేశారు. స్థానిక జేఏసీ చైర్మన్ వై. సత్తిబాబు, కన్వీనర్ వై. దారాజుల ఆధ్వర్యంలో సమస్యలపై స్థానిక ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ రాజేంద్రప్రసాద్‌లకు వినతి పత్రాలందించారు. స్థానిక ఎస్ఐ రవీంద్ర ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. సీలేరులో సీఐటీయూసీ నాయకులు ఆధ్వర్యంలో జెన్‌కో కాంట్రాక్టు కార్మికులు, ఆశా వర్కర్లు, ఇతర కార్మికులు 300 మంది భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏపీ జెన్‌కో "ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ లు శ్రీనివాస రెడ్డి, రాజేంద్రప్రసాద్‌కు వినతి పత్రాలను అందజేశారు.నాయకులు చింతా రాంబాబు, ఎస్‌కే సుభాన్, విష్ణుకుమార్‌రాజు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో..

డుంబ్రిగుడ: కేంద్రం తీసుకువచ్చిన లేబర్ కోడ్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ, మండలంలోని సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె బుధవారం విజయవంతమైంది. మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్మికులు, ఆశ కార్యకర్తలు, వీవోఏలు, సహకార బ్యాంకు సిబ్బంది, వీఆర్ఏలు టూరిజం కార్మికులు భారీ ర్యాలీ చేపట్టారు. పర్యాటక కేంద్రం చాపరాయి జలవిహారి మూతబడింది. ఈ సందర్భంగా మహిళ శ్రామిక సంఘం జిల్లా నాయకులు విజయ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పోతురాజు మాట్లాడారు.


పెదబయలులో ఆశ, అంగన్‌వాడీల మానవహారం

పెదబయలులో

పెదబయలు: మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ పార్కు వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు సన్నిబాబు,ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సునీల్, గంగాధరం, రామారావు, సుందర్‌దేవ్, నాగన్న, రాజమ్మ,మంగమ్మ, వరహాలమ్మ, ఈశ్వరమ్మ, కొండమ్మ పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: సీఐటీయూ మండల కార్యదర్శి గడుతూరు సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బుజ్జిబాబు, వీవోఏ మండల అధ్యక్ష, కార్యదర్శిలు పుష్ప, రామలింగం, అంగన్‌వాడీ హెల్పర్ యూనియన్ నాయకులు సత్యవతి, అప్పలనర్స, సూర్యనారాయణ, కుమారి, లక్ష్మి పాల్గొన్నారు.

హుకుంపేట: గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కృష్ణారావు , హైమవతి ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో వైస్ఎంపీపీ కొండలరావు, గిరిజన సంఘం నేత రామారావు, సీపీఎం నేతలు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ శాఖలల్లో పని చేస్తున్న కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు త్రినాథ్, భీమరాజు, శంకర్, ఎం.ఎం.శ్రీను, నర్సయ్య, రామదాసే, పార్వతి, శాంతమ్మ, విజయ, కళావతి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో రాష్ట్రాభివృద్ధి

» జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

పెదబయలు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని మాజీ మంత్రి , రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని గలగండ పంచాయితీలో టీడీపీ మండల అధ్యక్షురాలు సీకరి సుకుమారి ఆధ్వర్యంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనకు మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో విజయాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. రానున్న కాలంలో ప్రభుత్వం చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమస్యలను అధిగమిస్తూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి చూసి ప్రతిపక్ష పార్టీల నేతలు టీడీపీలో చేరుతున్నారన్నారు. పంచాయితీలకు నిధులు అత్యధిక నిధులు విడుదల చేస్తున్నారన్నారు. పింఛన్ల పెంపు, తల్లికి వందనం, ఉచిత వంట గ్యాస్ తదితరు పథకాలను ప్రజలకు చేరువ చేసినట్టు వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవణ్‌కల్యాణ్‌లకు గిరిజన ప్రాంతమంటే ఎనలేని ప్రీతి అని తెలియజేశారు. అందుకే ఇప్పటికే ఉపముఖ్యమంత్రి అరకు నియోజవర్గంలో రెండు సార్లు పర్యటించి కోట్ల రూపాయలతో పక్కారోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. అలాగే, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. త్వరలో అన్నధాత సుఖీభవ పథకం ద్వారా రైతుల ఖాతాల్లో మొదటి విడతగా రూ.7 వేలు జమ అవుతాయని చెప్పారు. గలగండ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ రాజేశ్‌ను ఫోన్‌లో కోరారు. ఈ టీడీపీ నాయకులు భూషణం, నాగేశ్వరరావు, పాండు రంగ స్వామి, వెంకటరమణరాజు, శశి భూషణ్, ప్రసాద్, రామారావు, మహేశ్వరి, వెంకటరమణ, కోటి, సుబ్బారావు, అచ్చిబాబు, అప్పారావు. మహేశ్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.


గలంగండలో పథకాలను వివరిస్తున్న శ్రావణ్‌కుమార్, నాయకులు

రహదారి పనులు వేగవంతం


రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి పీఓ అభిషేక్

జి.మాడుగుల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జరుగుతున్న రహదారి పనులు సకాలంలో పూర్తి చేయాలని పాడేరు ఐటీడీఏ ఇన్‌చార్జీ పీవో డా. అభిషేక్ గౌడ అధికారులకు ఆదేశించారు. ఈ రహదారి పనులకు ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఉపాధి నిధులతో పాలకొండ నుంచి రుడిబయలు వరకు 1.20 లక్షలు, కోరాపల్లి నుంచి పెదకొండ వరకు 1.40లక్షలు, పెదకొత్తూరు నుంచి సారుబయలు వరకు రూ.80లక్షల కుడ్డింగు నుంచి మునికర్ల వరకు రూ. లక్షలతో నిర్మాణాలు చేపడుతున్న పనులు ఈ నెలఖరులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డేవిడ్‌రాజు, ఏఈఈ బి.దుర్గ పాల్గొన్నారు.

చిట్టంపాడు వద్ద సర్వే చేస్తే ఒప్పుకోం.. : గిరిజనుల నిరసన

అనంతగిరి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టోకూరు పంచాయతీ చిట్టంపాడు వద్ద హైడ్రోపవర్ ప్రాజెక్టు రద్దు చేయాలని కోరుతూ ఆయా గ్రామాల గిరిజనులు సీపీఎం నాయకులతో కలిసి బుధవారం ఆందోళన చేపట్టారు. హైడ్రోపవర్ ప్రాజెక్టుపై అభిప్రాయసేకరణకు గ్రామ సభ నిర్వహిస్తున్నారని తెలుసుకుని వారు ఈ నిరసన చేపట్టారు. చిట్టంపాడు రోడ్డులోని చెట్టును రోడ్డుకు అడ్డంగా నరికివేసి, గిరిజన సంప్రదాయ ఆయుధాలను చేతపట్టి ఆందోళన చేశారు..హైడ్రో పవర్ ప్రాజెక్టు మాకొద్దంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు దేవన్న మాట్లాడుతూ.. హైడ్రోపవర్ ప్రాజెక్టు అనుమతులు వెంటనే రద్దుచేసి, గిరిజన ప్రాంత ప్రజల హక్కులు, చట్టాలను కపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోని సీపీఎం నాయకులు బుద్రయ్య, అప్పన్న, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.


చిట్టంపాడు రోడ్డులోని రోడ్డుకు అడ్డంగా చెట్టును నరికివేసి, ఆందోళన చేస్తున్న ఆయా గ్రామాల గిరిజనులు

తెరపల్లి గ్రానైట్ క్వారీ అక్రమాలపై నివేదిక: తహశీల్దార్

చింతపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న తెరపల్లి గ్రానైట్ క్వారీపై విచారణ చేపట్టి నివేదిక గనులశాఖ అధికారులకు పంపిస్తున్నట్టు స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ తెలిపారు బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తెరపల్లి గ్రానైట్ క్వారీపై స్పందనలో ఫిర్యాదులు వచ్చాయన్నారు. లీజు తీసుకోకుండగా తమ భూములపై క్వారీ వ్యర్థాలు పడేస్తున్నారని, పరిహారం ఇవ్వడంలేదని రాములమ్మ ఫిర్యాదు చేశారన్నారు. క్వారీ వల్ల గ్రామంలో పలువురు వ్యాధులకు గురవుతున్నారని, పంటలు ధ్వంసమవుతున్నాయని ఫి ర్యాదు చేశారన్నారు. ఈ స్థితిలో ఈనెల జూలై 5న పోలీసులతో రెవెన్యూ సిబ్బంది క్వారీని తనిఖీ చేశారన్నారు. లోపాలను గుర్తించి, నివేదికను గనులశాఖకు పంపిస్తున్నామని, తదుపరి చర్యలు అధికారులు తీసుకుంటారు.

ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

పాడేరురూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 77వ ఆవిర్భావ దినోత్సవం బుధవారం స్థానిక ప్ర భుత్వ డిగ్రీకళాశాల ప్రాంగంలో జిల్లా కన్వీనర్ తిరుపల్లి యోగా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాలుర వసతి గృహం వద్ద పతాకావిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ పూర్వ విద్యార్థి ఎంఎంఎల్ పాత్రుడు మాట్లాడుతూ 1949లో కొద్దిమంది విద్యార్థులతో ప్రారంభమైన ఏబీవీపీ జ్ఞాన, శీలం, ఏకత అనే మూడు ఆశయాలను ఆచరిస్తూ నిరంతరం విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ సిబ్బంది గునీనాయుడు, కోటేశ్వరరావు, గోపి, ఏబీవీపీ నాయకులు ఎం.గోపాలపాత్రుడు, పంతులు, చిన్నబ్బాయి, కృష్ణమూర్తి, నవీన్, సాగర్, ఈశ్వర్, మధు, శివ తదితరులు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

అధికారులు రాకుంటే సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి?

» మండల సమావేశంలో చింతపల్లి ఎంపీపీ అనుషదేవి

చింతపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలకోసారి జరిగే మండల సర్వ సభ్య సమావేశానికి అధికారులు హాజరుకాకపోతే సభ్యులు సమస్యలు ఎవరికి చెప్పాలని స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. తొలుత ఆర్‌డబ్ల్యూఎస్‌పై జరిగిన చర్చలో తా జంగి గ్రామ పంచాయతీలో ఆదివాసీలు తాగునీటికి ఇబ్బంది ఎదుర్కొంటున్నారని, జల్‌జీవన్ మిషన్ పథకం నిర్మాణం పూర్తికాలేదని సర్పంచ్ మహేశ్వరి సభ దృష్టికి తీసుకొచ్చారు. చింతపల్లిలో సాయినగర్, ఐటీడీఏ క్వార్టర్స్‌కి ఐదు నెలలుగా తాగునీటి సరఫరా జరగడంలేదని సర్పంచ్ దురియా పుష్పలత తెలిపారు. పలు గ్రామాల్లో జేజేఎం పథకాల నిర్మాణాల అసంపూర్తిగా ఉన్నట్టు ఎంపీటీసీ సభ్యులు ప్రస్తావించారు. దీనికి ఏఈఈ గడుతూరి స్వర్ణలత సమాధానం ఇస్తూ తాజంగిలో నిధులు విడుదల కాక పనులు పూర్తికాలేదన్నారు. సాయినగర్‌కి ప్రత్యేకంగా రక్షిత నీటి పథకం నిర్మిస్తున్నామన్నారు. అలాగే, ఉపాధి కూలీలకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించలేదని, వీటిపై ఎఫ్ఏ, టీఏలను ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని యర్రబొమ్మలు ఎంపీటీసీ సభ్యుడు సెగ్గె సత్తిబాబు తెలిపారు. ఏపీవో రాజు మాట్లాడుతూ ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే చెల్లిస్తామన్నారు. ఎస్ఎంఐ, పంచాయతీరాజ్, ఈపీడీసీఎల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఏఈఈలు బాలకిశోర్, లోకేశ్, ప్రభాకరరావు వివరించారు. తహసీల్దార్ టి. రామకృష్ణ మాట్లాడుతూ రేషన్ కార్డుల కోసం 4,670 దరఖాస్తులు వచ్చాయని, 3,600 పరిశీలించి ఆమోదించామన్నారు. చింతపల్లిలో ఆక్రమణల తొలగిస్తున్నట్టు వివరించారు. దుకాణాలు కోల్పోయిన వ్యాపారుల కోసం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెండెకరాల్లో ప్రభుత్వ సహకారంతో బహుళ అంతస్థుల షాపింగ్ కాంప్లెక్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ గత తొమ్మిది నెలలుగా గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్, గిరిజన సహకార సంస్థ అధికారులు మండల సమావేశాలకు హాజరుకావడంలేదన్నారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, తాజంగి, లంబసింగి, లోతుగెడ్డ, కోరుకొండ పీహెచ్‌సీల వైద్యాధికారులు, పాడేరు ఆర్టీసీ తదితర శాఖల అధికారులు హాజరుకావడం లేన్నారు. ఈ నేపథ్యంలో వీరిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి, వైస్ ఎంపీపీలు సాగిన వెంగళరావు, గోపీనాయ్ శారద, వివిధశాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు.


మాట్లాడుతున్న ఎంపీపీ అనుషదేవి

గుండెపోటుతో వ్యాయామ ఉపాధ్యాయుడు మృతి

ముంచంగిపుట్టు, జులై 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల-1లో వ్యాయామ ఉపాధ్యాయుడు(పీఈటీ) ఎం.వీరేశ్‌లింగంనాయుడు(55) బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. స్థానిక ఉపాధ్యాయ నివాస గృహంలో ఉంటున్న వీరేష్‌లింగంనాయుడుకు బుధవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో ఆకస్మికంగా గుండెల్లో నొప్పి రావడంతో అతని భార్య ఈశ్వరమ్మ, స్థానికుల సహాయంతో ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తీసుకువెళ్లే ప్రయత్నం చేసేలోపే అతను మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతనిది స్వగ్రామం హుకుంపేట మండలం మట్టం గ్రామానికి మృతదేహాన్ని తరలించి, అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ ఆకస్మికంగా మృతిపై పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీ, సిబ్బంది, పీడీలు, పీఈటీలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.


వీరేశ్‌లింగంనాయుడు (ఫైల్)

పాడేరులో రెడ్ క్రాస్ సొసైటీ భవన నిర్మాణానికి సహకరించాలి


నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర శాఖకు వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

పాడేరురూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): పాడేరులో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి శాశ్వత భవన నిర్మాణానికి సహకరించాలని రాష్ట్ర శాఖకు గవర్నర్ సమక్షంలో రాష్ట్ర చైర్మన్ డాక్టర్ వైడీ రామారావుకు బుధవారం వినతిపత్రం అందించినట్టు జిల్లా సొసైటీ వైస్‌చైర్మన్ ఎస్.గంగరాజు, ప్రధాన కార్యదర్శి జి.గౌరీశంకరరావు తెలిపారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన 6వ వార్షిక సర్వసభ్య సమావేశానికి జిల్లా బృందం హాజరయ్యామన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గవర్నర్, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో సీజనల్ వ్యాధులు, సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారన్నారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలపై ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు బొర్రా నాగరాజు, పి.సూర్యారావు, సంజీవరావు, రవి, శ్రీనివాస్, ప్రసాద్, విజయలక్ష్మి, కృపారావు, సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ పాల్గొన్నారు.

హెల్త్ ఆఫీసర్లు హెడ్ క్వార్టర్‌లోనే ఉండాలి: డీఎంహెచ్‌వో

పాడేరురూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల ఆరోగ్య రక్షణకు ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం (హెచ్‌డబ్ల్యూసీ)లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు హెడ్‌క్వార్టర్లలోనే నివాసముంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని డీఎంహెచ్‌వో టి.విశ్వేశ్వరరావునాయుడు సూచించారు. మండలంలోని మినుములూరు పీహెచ్‌సీ పరిధిలోని గుత్తులపుట్టు హెచ్‌డబ్ల్యూసీని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు, మందులను పరిశీలించారు. రోగులకు అం దిస్తున్న వైద్య సేవల గురించి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు హెచ్‌డబ్ల్యూసీని తెరచి ఉంచాలన్నారు. రోగులకు రోగనిర్ధారణ పరీక్షలు చేపట్టాలని,అనంతరంగ్రామంలో ఐఆర్ఎస్ 5 శాతం ద్రావణం స్ప్రే పనులు పరిశీలించారు.

ప్రతి చిన్నారికీ ఆధార్ నమోదు తప్పనిసరి: జేసీ

పాడేరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రతి చిన్నారికీ తప్పని సరిగా ఆధార్ నమోదు చేయాలని ఐటీడీఏ ఇన్‌ఛార్జి పీవో, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయంలో గ్రామ సచివాలయం, ఐసీడీఎస్, పీఎంయూ అధికారులతో చిన్నారుల ఆధార్, జనన ధ్రువీకరణ అంశాలపై బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐటీడీఏ పరిధిలో 4,765 మంది పిల్లలకు ఆధార్‌కార్డులు, 3,484 మందికి జనన ధ్రువీకరణపత్రాలు లేవని గుర్తించామన్నారు. ఈనెలాఖరునాటికి ఈ చిన్నారులకు విధిగా ఆధార్ నమోదు చేయాలని సూచించారు. ఈ ఐటీడీఏ ఏపీవో ఎం. వెంకటేశ్వరరావు, గ్రామ సచివాలయాల జిల్లా నోడల్ అధికారి పీఎస్.కుమార్, గ్రామ సచివాలయాల సమన్వయకర్త కె.సునీల్, సీడీపీవో కేబీహెచ్‌ఎం.మణి, పీఎంయూ అధికారి రాజేశ్, ఆధార్ కోఆర్డినేటర్ నాగరాజు పాల్గొన్నారు.

కస్టమర్ సర్వీస్ పాయింట్లలలో అక్రమ వసూళ్లపై ఫిర్యాదు

ముంచంగిపుట్టు, జులై 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కస్టమర్ సర్వీసు పాయింట్ (సీఎస్‌పీ)లలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని గిరిజనసంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గిరిజనసంఘం మండల అధ్య క్షుడు ఎం.ఎం.శ్రీను, నేతలు నర్సింగరావు, గాసీరాందొరలు బుధవారం స్థానిక స్టేట్‌బ్యాంక్, గ్రామీణ వికాశ్ బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లకు వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని సీఎస్‌పీ కేంద్రాల్లో పీఎం జన్‌మన్ గృహాలు, తల్లికి వందనం పథకాల్లో మోసాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. రూ.1000 విత్‌డ్రా చేస్తే రూ.10 నుంచి 30 వరకు కోత పెడుతున్నారని తెలిపారు. స్పందించిన బ్యాంక్ మేనేజర్లు సీఎస్‌పీ కేందాల వద్ద ఎటువంటి సొమ్ము చెల్లించాల్సిన అవసరం లేదని, విత్‌డ్రాలో మోసాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మన్యంలో మేఘాలయ బృందం పర్యటన

పాడేరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): మన్యంలో గిరిజన రైతులు అవలంబిస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను అధ్యాయనం చేసేందుకు మేఘాలయకు చెందిన బృందం బుధవారం జి.మాడుగుల మండలంలో పర్యటించింది. రైతు సాధికారత సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని గిరిజన రైతులు సేంద్రీయ పద్ధతులను పాటిస్తూ వివిధ పంటల సాగును చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 94 వేల ఎకరాల్లో సేంద్రీయ వ్యవసాయాన్ని చేపడుతున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని సేంద్రీయ పద్ధతులను అధ్యాయనం చేసేందుకు మేఘాలయ నుంచి పది మందితో కూడిన బృందం జిల్లాకు ఈ నెల 8న వచ్చింది. జి.మాడుగుల మండలంలోని నిట్టాపుట్టులో బుధవారం సేంద్రీయ వ్యవసాయ నమూనాలను పరిశీలించిన బృందం సభ్యులు, మరో వారం రోజులు ఈ ప్రాంతంలో పర్యటిస్తామని పేర్కొన్నారు.


జి.మాడుగుల మండలం నిట్టాపుట్టులో ప్రకృతి వ్యవసాయ నమూనాను పరిశీలిస్తున్న మేఘాలయ బృందం

చెట్టును ఢీకొన్న ఆటో

మూగ యువతి మృతి మరో ముగ్గురు దివ్యాంగులకు స్వల్ప గాయాలు

సబ్బవరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పినగాడి- కె.కోటపాడు రోడ్డులో గల అయ్యన్నపాలెం ఎస్సీ కాలనీ వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మూగ యువతి మృతి చెందగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి. అల్లూరి జిల్లా అనంతగిరి మండలం తట్టవలస గ్రామానికి చెందిన సారా శాంతి (22), పరవాడ మండలం దళాయపాలేనికి చెందిన సీహెచ్.నరేంద్ర, విజయనగరానికి చెందిన కె.రాజ్యలక్ష్మి, కె.ధనలక్ష్మి, సబ్బవరం మండలం మొగలిపురానికి చెందిన ఎం.అనంతకుమార్ వీరంతా దివ్యాంగులు (మూగ, చెవిటి). వీరు ఐదుగురు విశాఖలోని మురళీనగర్‌లో గల గ్రోత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్నారు. సింహాచలం గిరి ప్రదక్షిణకు అని బుధవారం ఇన్‌స్టిట్యూట్‌లో చెప్పి ఆటోలో బయలేర్దారు. తిరిగి గిరి ప్రదక్షిణకు వెళుతుండగా, అయ్యన్నపాలెం ఎస్సీ కాలనీ వద్ద కు వచ్చే సరికి రోడ్డు దాటుతున్న పాము కనిపించింది. దీంతో ఆటో డ్రైవర్ కంగారు పడడంతో ఆటో ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీకొంది. ఆటోలో ఉన్న సారా శాంతి తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కె.ధనలక్ష్మి, ఎం.అనంతకుమార్, సీహెచ్. నరేంద్రలకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ జి.రామచంద్రరావు తెలిపారు. కాగా, డ్రైవర్ పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

కొయ్యూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమమ రవాణాతోపాటు మావోయిస్టుల కదలికలు ఉన్నాయనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు అప్రమత్తమయ్యారు. కొయ్యూరు పోలీస్ స్టేషన్ పరిధి ప్ర ధాన కూ డళ్లలో బుధవారం ఉదయం నుంచి వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. చీడిపాలెం కూడలిలో ఎస్ఐ కిశోర్‌వర్మ ఆధ్వర్యంలో ఇద్దరు పీఎస్ఐలు, సిబ్బంది వచ్చే పోయే వాహనాలను తనిఖీ చేశారు.


బస్సులో తనిఖీ చేస్తున్న ఎస్ఐ

గర్భిణికి తప్పని డోలీ మోత

- పందిరిమామిడి గ్రామానికి రహదారి సౌకర్యం లేక ఆరు కిలోమీటర్లు మోసుకెళ్లాల్సిన దుస్థితి

అనంతగిరి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడం గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని పినకోట పంచాయతీ పందిరిమామిడి గ్రామానికి చెందిన డిప్పల రాములమ్మకు బుధవారం ఉదయం పురిటినొప్పులు వచ్చాయి. అయితే ఆ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆమె భర్త నరసింహమూర్తి... గ్రామస్థులు రామన్న, వెంకటప్రసాద్, పోతురాజు సహాయంతో పందిరిమామిడి నుంచి దట్టమైన అటవీ ప్రాంతం గుండా డోలీలో రాములమ్మను బొర్రాపాలెం వరకు మోసుకువచ్చారు. అక్కడ నుంచి పినకోట పీహెచ్‌సీకి అంబులెన్స్‌లో తరలించారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో అత్యవసర సమయాల్లో ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


నర్సీపట్నం రహదారిపై ర్యాలీ చేస్తున్న అసంఘటిత రంగ కార్మికులు


చోడవరంలో తెరచుకోని యూనియన్ బ్యాంకు కార్యాలయం, దుకాణాలు


మాడుగుల బస్టాండ్ ఆవరణలో మానవహారంగా ఏర్పడిన స్కీమ్ వర్కర్లు

కదంతొక్కిన కార్మిక లోకం

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అసంఘటిత రంగ కార్మికులు బుధవారం చేపట్టిన దేశ వ్యాప్త సమ్మె విజయవంతమైంది. పలు డిమాండ్లు నెరవేర్చాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన ఈ సమ్మెలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులు విధులను బహిష్కరించి పాల్గొన్నారు. ఇందులో భాగంగా నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో భారీగా ర్యాలీలు, రాస్తారోకోలు, మానవహారాలు నిర్వహించారు.

దేశ వ్యాప్త సమ్మె విజయవంతం

భారీగా ర్యాలీలు, మానవహారాలు, రాస్తారోకోలు

తరలివచ్చిన అసంఘటిత రంగ కార్మికులు

నర్సీపట్నం నియోజకవర్గంలో...

నర్సీపట్నం/మాకవరపాలెం/గొలుగొండ/కృష్ణాదేవిపేట/నాతవరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో దేశ వ్యాప్త సమ్మె విజయవంతమైంది. నర్సీపట్నంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి ఆర్టీసీ కూడలి వరకు 300 మంది కార్మికులతో ర్యాలీ చేశారు. అనంతరం అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్య


గొలుగొండలో లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కార్మికులు

దర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చి కార్మికులు, రైతుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. లేబర్ కోడ్స్, రైతు వ్యతిరేక చట్టాలను అమలు చేస్తున్నదన్నారు. కార్మికులకు 12 గంటల పని దినాలు అమలు చేయనున్నారని తెలిపారు. 104, 108 యాజమాన్యాలు కార్మిక చట్టాలు అమలు చేయడం లేదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గొలుగొండ మండల కేంద్రంతో పాటు కృష్ణాదేవిపేట, ఏఎల్‌పురంలో కార్మికుల సమస్యలపై చేపట్టిన సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, పలు రంగాల కార్మికులు ర్యాలీ, రాస్తారోకోలు నిర్వహించారు. సీఐటీయూ నేత త్రిమూర్తులురెడ్డి మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం అందించాలని, కార్మికులను న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మంగ, భ్రమరాంబ, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. మాకవరపాలెంలో అంగన్‌వాడీ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. హైస్కూల్ నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అనంతరం అక్క మానవహారంగా ఏర్పడి నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అలాగే గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు.

నాతవరం ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, భోజన పథకం నిర్వాహకులు నిరసన తెలిపారు. బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. కార్మిక చట్టాలను కాపాడుకుంటామని ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కె.ప్రసన్న పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సత్యవతి, వసంత, రాజేశ్వరి, లక్ష్మీ, లక్ష్మీబాయ్, రామలక్ష్మీ పాల్గొన్నారు.

చోడవరం నియోజకవర్గంలో...

చోడవరం/రావికమతం/రోలుగుంట/బుచ్చెయ్యపేట: చోడవరం నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల్లో కార్మిక వ్యతిరేక చట్టాలకు నిరసనగా చేపట్టిన సమ్మె విజయవంతమైంది. చోడవరంలో బ్యాంకులు, ఎల్ఐసీ కార్యాలయం తదితర సంస్థలు మూతపడ్డాయి. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో కార్మికులు ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించి లేబర్‌కోడ్ చట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు ఆబోతు శ్రీనివాసరావు, గోవింద్, నూకరాజు, దుర్గారావు, గూనూరు వరలక్ష్మి, వి.శ్రీనివాసరావు, కార్మికులు పాల్గొన్నారు.

రావికమతంలో సీఐటీయూ మండల కార్యదర్శి వజ్రపు సత్యవతి ఆధ్వర్యంలో ఆశ, అంగన్‌వాడీ, ముఠా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన పథనం నిర్వాహకులు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో మానహారంగా ఏర్పడ్డారు. అలాగ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ అంసఘటిత రంగ కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, పలు కార్మిక సంఘాల నాయకులు ఎస్.సత్యవేణి, ఎస్.అమ్మాజీ, పుష్ప, ధనుంజయరావు పాల్గొన్నారు. రోలుగుంటలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, పలు రంగాల కార్మికులు మానవ


రావికమతంలోని తట్టబంద కూడలిలో మానవహారం చేస్తున్న కార్మికులు

హారం ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేత ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రూ.10 లక్షల వరకు బీమా సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే బుచ్చెయ్యపేట మండల కేంద్రంలో పలు రంగాల కార్మికులు సమ్మెలో భాగస్వాములయ్యారు.

మాడుగుల నియోజకవర్గంలో...

మాడుగుల/దేవరాపల్లి/చీడికాడ/దేవరాపల్లి: మాడుగుల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో దేశ వ్యాప్త సమ్మె నిర్వహించారు. మాడుగుల మండల కేంద్రంలో సీఐటీయూ నేత ఇరట నరసింహమూర్తి ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో కార్మికులు మానవహారంగా ఏర్పడి సమస్యలపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం



కె.కోటపాడులో ర్యాలీ చేస్తున్న అసంఘటిత రంగ కార్మికులు

ప్రతినిధి కార్లి భవాని పాల్గొన్నారు. దేవరాపల్లిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న, సీఐటీయూ మండల కార్యదర్శి సూరిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బీటీ దొర తదితరులు మాట్లాడుతూ లేబర్ కోడ్‌ల రద్దు చేయాలని, కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, స్కీమ్ వర్కర్లకు పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. చీడికాడలో పలు సంఘాల కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రొంగలి దేముడునాయుడు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం పటిష్టపరచాలని, పలు డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నాగరాజు, రాజులమ్మ, కామాక్షి, కొండమ్మ, లక్ష్మి, వరలక్ష్మి, రమణమ్మ, అప్పలనాయుడు పాల్గొన్నారు. కె.కోటపాడు మండల కేంద్రంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, రైతులు, చేతి వృత్తిదారులు ర్యాలీ చేశారు. అలాగే మూడు రోడ్ల జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఈర్లె నాయుడుబాబు మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు, పలు సంఘాల నాయకులు జి.కుమారి, పి.భవాని, ఎం.లక్ష్మి, ఎన్.కుమారి, ఆర్.పైడితల్లమ్మ, ఎం.సీత, ఎస్.సన్యాసమ్మ, ఎస్కే.బీబీ, గండి జగ్గమ్మ, రొంగలి ఈశ్వరరావు, ఈర్లె రామనాయుడు పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి హాజరుకండి

హారతులు, పుష్పాలతో ఉపాధ్యాయుల ఆహ్వానం

రోలుగుంట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరై పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చడానికి కృషి చేయాలని ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు మండలంలోని వెంలకాయలపాలెంలో పాఠశాల హెచ్ఎం బండారు సూర్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులను హారతులు, పుష్పాలు అందించి వినూత్నంగా ఆహ్వానించారు. పాఠశాల కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు బి.చంద్రశేఖర్ విద్యార్థులతో కలిసి తల్లిదండ్రుల ఇళ్లకు వెళ్లి సమావేశానికి రావాలని ఆహ్వానం పలికారు. కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

రామాలయానికి విగ్రహాల విరాళం


సీతారాముల విగ్రహాలు

బుచ్చెయ్యపేట జూలై 9 (ఆంధ్ర జ్యోతి): మండలంలో వడ్డాది కొత్తూరు రామాలయానికి పలువురు వ్యక్తులు విగ్రహాలకు విరాళంగా అందించారు. రూ2.2 లక్షలతో సీతారాములు, ఆంజనేయుడు, లక్ష్మణుడు విగ్రహాలకు స్థానిక భక్తుడు రాజాన రాజారావు, ఉమా వెంకటలక్ష్మి తమ సొంత నిధులతో ఆలయంలో విగ్రహాలను ప్రతిష్ఠ చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నర్సీపట్నం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పెదబొడ్డేపల్లి, బలిఘట్టం సబ్ స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఏఈఎస్ఎం అప్పారావు తెలిపారు. విద్యుత్ లైన్‌కు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేపడతామని, అందువల్ల గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకు శారదానగర్, లింగాపురం, బ్యాంక్ కాలనీ బలిఘట్టం, లింగాపురంలో విద్యుత్ సరఫరా ఉండదని స్పష్టం చేశారు. తమ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు.

గొలుగొండలో...

గొలుగొండ: మండల కేంద్రంలోని 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గురువారం మరమ్మతు పనులు చేపడతామని ఈఈ ఏఈఎస్ఎం.అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జోగంపేట, గొలుగొండ, పప్పుశెట్టిపాలెంతోపాటు పలు గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులు గమనించి, తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

మాడుగులలో సరఫరా నిలిపివేత రేపు

మాడుగుల రూరల్: మండలంలోని ఎం.కోడూరు సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఆ శాఖ ఏఈ రాంబాబు తెలిపారు. ఎం.కోడూరు విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణతో పాటు లైన్‌లో మరమ్మతు పనుల కారణంగా ఎం.కోడూరు, శంకరం, సాగరం, తాటిపర్తి పంచాయతీ గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. ఉదయం నుంచి 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల విద్యుత్ సరఫరా ఉండదని, తమ సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

చీడికాడలో...

చీడికాడ: చీడికాడ ఫీడర్ పరిధిలోని 11 పంచాయతీల్లో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తామని ఆ శాఖ ఏఈ నమ్మి వెంకటరావు బుధవారం తెలిపారు. ఈ నెల 11వ తేదీన ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ పనుల నిమిత్తం చీడికాడ, తురువోలు, అర్జునగిరి, జి.కొత్తపల్లి, పెదగోగాడ, వరహాపురం, వింటిపాలెం, చుక్కపల్లి, చెట్టుపల్లి తదితర పంచాయతీల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన చెప్పారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: చీడికాడ నుంచి దేవరాపల్లి సరఫరా అయ్యే 33 కేవీ విద్యుత్ లైన్ మెరుగుపర్చేందుకు శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏఈఈ కర్రి శంకరరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు దేవరాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. బి.కింతాడ సబ్ స్టేషన్ పరిధిలో గ్రామాలకు కూడా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని ఆయన చెప్పారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

» ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి


వెంకటరాజపురంలో మహిళలకు కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

దేవరాపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రతీ గ్రామం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించానని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి చెప్పారు. మండలంలోని వెంకటరాజపురం గ్రామంలో మంగళవారం రాత్రి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలు లేని గ్రామాలుగా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. అర్హులందరికీ పథకాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, పార్టీ నేత పాత్రునాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే మోడల్ కాలనీలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు ఏసుదాసు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నదీ? లేనిది? తెలుసుకున్నారు. అలాగే ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. నాగయ్యపేటలో సర్పంచ్ కర్రి పుష్ప ఇంటింటా తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, జలాశయ ఛైర్మన్ పాత్రునాయుడు, సర్పంచ్ పెంటమ్మ, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రాయితీలపై రైతులను చైతన్యపర్చండి: ఎమ్మెల్యే బండారు

చీడికాడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రాయితీలపై రైతులను చైతన్య పర్చాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. మండలంలోని ఎన్.కొత్తూరు గ్రామంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఎక్కువ ఎకరాల్లో మొక్కలు నాటించాలని ఆదేశించారు. మొక్కల సంరక్షణ కోసం రైతులకు మూడేళ్ల వరకు ప్రభుత్వం శతశాతం రాయితీ ఇస్తున్న విషయాన్ని వివరించాలని సూచించారు. అలాగే మొక్కలు పెంచినపుడు అంతర పంటలు వేసుకుంటే రైతులకు అధిక ఆదాయం సమకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు వాసురెడ్డి ఏసుదాసు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, తహసీల్దార్ కిషోర్‌లింకన్, ఉపాధి పథకం ఏపీడీ బండారు శ్రీనివాసరావు, ఏపీవో అల్లు గంగునాయుడు, హార్టికల్చర్ సూపర్‌వైజర్ కొరగింజల శ్రీనివాసరావు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది సతీశ్, మోహన్, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా మార్కెట్ యార్డు అభివృద్ధి

» నర్సీపట్నం మార్కెట్ యార్డు ఛైర్మన్ వెంకటరమణ


మాట్లాడుతున్న ఛైర్మన్ వెంకటరమణ

నర్సీపట్నం అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం మార్కెట్ యార్డు అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని ఛైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ చెప్పారు. తన చాంబర్‌లో సంబంధిత ఉద్యోగులు, పాలకవర్గంతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి కోసం ఆదాయ వనరులు ఏ విధంగా సమకూర్చుకోవాలనే అంశంపై చర్చిస్తున్నా మన్నారు. వ్యాపారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే రైతు బజారును త్వరగా వినియోగంలో తీసుకురావడం, మార్కెట్ కమిటీ ద్వారా ఎరువులు అమ్మకం పరిశీలన, కోల్డ్ స్టోరేజీ వినియోగంలోకి తేవడంపై దృష్టి సారించామన్నారు. ఈ నెల 11న నిర్వహించనున్న వ్యవసాయ యాంత్రీకరణ మేళాకు రైతులు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ చిటికెల కన్నయ్యనాయుడు, కార్యదర్శి భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పాత రూటులో పెదమదినా బస్సు తిప్పాలని నిరసన

బుచ్చెయ్యపేట జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో 30 ఏళ్లుగా నడుస్తున్న పెదమదినా బస్సును పాత రూటులోనే తిప్పాలని ఎనిమిది గ్రామాల ప్రజలు బుధవారం నిరసన తెలిపారు. ఈ బస్సు ఎదుటే వారు ఆందోళనకు దిగారు. పెదమదీనా బస్సు కేపీ అగ్రహారం, కొండపాలెం, గున్నెంపూడి జంక్షన్ మీదుగా పెదమదిన వచ్చేదని, చెట్టు కొమ్మలు, గోతుల కారణంగా బస్సు నడపడం కుదరదనే సాకుతో బుచ్చెయ్యపేట, కందిపూడి మీదుగా నడపడం సరికాదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బస్సు విద్యార్థులు, రోగులకు విశాఖపట్నం వెళ్లడానికి ఎంతో అనువుగా ఉండేదని, ప్రస్తుతం బస్సు రాకపోవడంతో వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. బస్సు రాకపోవడంతో కేపీ అగ్రహారం, కొండపాలెం సర్పంచులు సొంత నిధులతో రోడ్డుకిరువైపులా చెట్టు కొమ్మలను నరికించారని, అలాగే రోడ్డుపై గంతలు కూడా పూడ్చించారని చెప్పారు. ఇప్పటికైనా విశాఖపట్నం ఆర్టీసీ అధికారులు స్పందించి పాత రూట్లోనే పెదమదీనా బస్సు నడపాలని వారు విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేపీ అగ్రహారం సర్పంచ్


పెదమదీనా బస్సు ఎదుట నినాదాలు చేస్తున్న సర్పంచులు, ప్రజలు

గోపిశెట్టి శ్రీనివాసరావు, కొండపాలెం సర్పంచ్ ముచ్చకర్ల భవానీ, గున్నెంపూడి సర్పంచ్ హరణి, నాయకులు తాతీలు, అప్పారావు, దర్మప్రచారక్ నాగేశ్వరరావు, ఎనిమిది గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ

నర్సీపట్నం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నియోగవర్గంలోని బీఎల్‌వోలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఎలక్షన్ కమిషనర్ ఆదేశాలతో సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో 8, 9, 10, 15, 16, 17 తేదీలలో బూత్ స్థాయి అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్ ఎం.జయంత్ కుమార్ ఆధ్వర్యంలో బీఎల్‌వోల విధులు, బాధ్యతలపై శిక్షణ ఇస్తున్నారు. కొత్త ఓటర్లు చేర్పించడం, చనిపోయిన ఓటర్లు తొలగింపులు తదితర అంశాలను మాస్టర్ ట్రైనర్ వివరించారు. ఓటర్లను చేర్చే క్రమంలో అవకతవకలకు పాల్పడితే చట్ట పరంగా తీసుకునే శిక్షలను కూడా ఆయన వివరించారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు కృషి

» మండల ప్రత్యేక అధికారి మంజుల వాణి

దేవరాపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని మండల ప్రత్యేక అధికారి మంజులవాణి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యాచరణ ప్రణాళికపై అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం ఎంపీపీ బుల్లి లక్ష్మి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పారదర్శక పాలన, మహిళ శక్తీకరణ, డిజిటల్ గవర్నన్స్, సామాజిక న్యాయం వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకోవాలన్నారు. ఎంపీడీవో సువర్ణరాజు, జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, మండల ఉపాధ్యక్షుడు సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

పామాయిల్ సాగుకు మొగ్గు చూపండి

నాతవరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో పామాయిల్ సాగుకు రైతులు మొగ్గు చూపాలని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ మాజీ డైరక్టర్ పైల పోతురాజు సూచించారు. మండలంలో పామాయిల్ తోటల విస్తరణ మహోత్సవంలో భాగంగా బుధవారం రైతులతో నిర్వహించిన అవగహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎకరా పామాయిల్ సాగుతో ఏడాది రూ.లక్ష ఆదాయం వస్తోందన్నారు. దళారులు లేని, దోపిడీ జరగని పంట పామాయిలేనని ఆయన చెప్పారు. పతంజలి ఫుడ్ సీనియర్ మేనేజర్ చంద్రశేఖర్ దేశంలో ఏడాదికి రూ.2.5 లక్షల లీటర్ల నూనె అవసరం అవుతుందని, విదేశాల నుంచి నూనె దిగుమతి చేసుకోకుండా పామాయిల్ సాగు చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే పామాయిల్ సాగు వల్ల ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. అనంతరం పామాయిల్ సాగు యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పామాయిల్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, వెంకట సీతారామరాజు, మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు, స్థానిక నాయకుడు ఇటంశెట్టి శ్రీనివాసు, అసిస్టెంట్ మేనేజర్ కె.రమేశ్, ఫీల్డ్ అధికారి ఎ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గుండె వ్యాధుల వైద్య శిబిరానికి విశేష స్పందన

రావికమతం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన గుండె వ్యాధుల వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బుచ్చియ్యపేట మండలం పొట్టిదొరపాలెంకు చెందిన ఉత్తమ సంఘ సేవిక అవార్డు గ్రహీత, వీఎస్ఆర్ ట్రస్ట్ అధినేత వడ్డి సత్యారావు విజ్ఞప్తి మేరకు విశాఖ ఎన్నారై ఆసుపత్రి కార్డియాలజిస్ట్ మీసాల సుజిత్ కుమార్‌నాయుడు ఈ శిబిరం నిర్వహించారు. సీనియర్ సిటిజన్ 150 మంది వరకు తరలి వచ్చారు. వీరందరికీ కార్డిలయాజిస్ట్ సుజిత్ కుమార్‌నాయుడు మెరుగైన వైద్య సాయం అందజేశారు. అవసరమైన రోగులకు రెండు వేల రూపాయల విలువైన టుడి ఈకో, ఈసీజీ వైద్య పరీక్షలు నిర్వహించారు. అంతకు ముందు వైద్య శిబిరాన్ని టీడీపీ నాయకులు వేపాడ నాగేశ్వరావు, జనసేన నాయకులు గంజి శ్రీను ప్రారంభించారు.

ముస్లింల సమస్యలపై మంత్రికి వినతి

మాడుగుల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో ముస్లింల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మాడుగుల జామియా మసీదు అధ్యక్షుడు షేక్ మస్తాన్ తెలిపారు. ఈ మేరకు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫారుఖ్‌ను అమరావతిలోబుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. మాడుగులలో పురాతనమైన జామియ మసీదు పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి స్పందిస్తూ మసీదు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్టు మస్తాన్ తెలిపారు. ముస్లింల సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రికి ఇక్కడ ముస్లింల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ముస్తాన్

బంధువు అంత్యక్రియలకు వచ్చి నదిలో మునిగి వ్యక్తి మృతి

» చోడవరం మండలం జన్నవరంలో ఘటన

చోడవరం, జూలై 9 (ఆంధ్ర జ్యోతి) : బంధువు అంత్యక్రియలకు వచ్చి నదిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలివి. చోడవరం మండలం జన్నవరంలో బంధువు మృతి చెందడంతో కె.కోటపాడు మండలం చౌడువాడ గ్రామానికి చెందిన సీహెచ్.సన్యాసిరావు (35) విచ్చేశాడు. మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకు వెళ్లడంతో వెంట వెళ్లాడు. పెద్దేరు నదిలో స్నానానికి దిగడంతో గల్లంతయ్యాడు. దీనిపై పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సమాచారం అందడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చేపట్టారు. చివరకు సన్యాసిరావు మృతిచెందడంతో మృతదేహాన్ని వెలికి తీసి బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనతో ఆయా గ్రామాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి.

యాంత్రీకరణ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

మాకవరపాలెం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం మార్కెట్ యార్డులో ఈ నెల 11వ తేదీన జరగనున్న వ్యవసాయ యాంత్రీకరణ మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖాధికారి డి.అప్పారావు బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ మేళాలో ఉత్పాదక పెరగడం, శ్రమ తగ్గడం, సమయం ఆదా కావడం, పెట్టుబడుల ఖర్చులు తగ్గడం, నేల, నీటి వనరుల సంరక్షణ తదితర అంశాలపై రైతులకు అధికారులు పలు సూచనలు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమానికి రైతులు అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

రావికమతం టీడీపీ పరిశీలకుడిగా సూర్యనారాయణ



దేవరాపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపురానికి చెందిన చిటిమి రెడ్డి సూర్యనారాయణను రావికమతం టీడీపీ పరిశీలకుడిగా నియమిస్తూ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. ఎంపీటీసీ మాజీ సభ్యుడు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడిగా పనిచేసిన సూర్యనారాయణను రావికమతం పరిశీలకుడిగా పార్టీ అధిష్ఠానం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.


బుధవారం సాయంత్రం జనసంద్రంగా మారిన కొండ దిగువన తొలిపావంచా ప్రాంతం

కొండంత భక్తితో..

సింహగిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు



విశాఖపట్నం/సింహాచలం, జూలై 9 (ఆంధ్రజ్యోతి):

సింహాచల వరహా లక్ష్మీనృసింహస్వామి గిరి ప్రదక్షిణకు భక్తులు పోటెత్తారు. బుధవారం వేకువజాము నుంచే సింహాచలం తొలిపావంచా వద్ద భక్తి ప్రపత్తులతో స్వామివారి ఎదుట కొబ్బరికాయలు కొట్టి 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణకు శ్రీకారం చుట్టారు. ఉత్తరాంధ్రతో పాటు రాష్ట్రంలోని అనేక జిల్లాల నుంచే కాకుండా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు గిరి ప్రదక్షిణ చేసేందుకు తరలివచ్చారు. చిన్న, పెద్ద అన్న తారతమ్యం లేకుండా అప్పన్న స్వామి నామస్మరణతో అడుగులో అడుగు వేస్తూ ఎంతో ఉత్సాహంగా ప్రదక్షిణలో పాల్గొన్నారు.


జోరుగా.. హుషారుగా నవతరం..


తొలి పావంచా వద్ద స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు


భక్తుల రద్దీని పర్యవేక్షిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి


భక్తి పారవశ్యం...


విశాలాక్షినగర్ వద్ద భక్తుల కాళ్లకు స్ప్రే చేస్తున్న దృశ్యం


ఉత్సాహవంతంగా యువతరం..


తొలి పావంచా వద్ద కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు


గోశాల నుంచి తొలి పావంచా వద్దకు వెళుతున్న భక్తజనం


సొమ్మసిల్లిన యువతికి సపర్యలు..


సీతమ్మధారలో ప్రసాదం పంపిణీ చేస్తున్న సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ


సముద్ర స్నానాలు ఆచరిస్తున్న మహిళలు


ఎండొచ్చినా.. వానొచ్చినా ఇబ్బంది లేకుండా..


భక్తుల కాళ్లకు ఆయిల్ మసాజ్ చేస్తున్న గోపాలపట్నం సత్యసాయి సేవా సమితి సభ్యులు


సీతమ్మధార వద్ద బుధవారం సాయంత్రం...


రాత్రి గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తజనం


జాతీయ రహదారిపై రాత్రి స్తంభించిన ట్రాఫిక్

ఐదోసారి గిరి ప్రదక్షిణ చేస్తున్నా..

-చిన్నాపల్లి పార్వతి, దేవరాపల్లి, అనకాపల్లి జిల్లా



మా ఇంటి ఇలవేల్పు, కోరిన కోరికలు తీర్చే స్వామి సింహాద్రి అప్పన్న. సొంతింటి కల నెరవేరితే గిరి ప్రదక్షిణకు వస్తానని ఐదేళ్ల కిందట మొక్కు కున్నా. స్వామివారి ఆశీస్సులతో ఇల్లు కట్టుకున్నాం. ఇల్లు కట్టిన వెంటనే గిరి ప్రదక్షిణకు వచ్చాను. ఇప్పుడు ఐదోసారి గిరి ప్రదక్షిణ చేస్తున్నా.

ఏ మాత్రం ఇబ్బంది అనిపించదు

- సీహెచ్ వీరేంద్ర, తుని, కాకినాడ జిల్లా



సింహాచలేశుడు మహిమాన్వితుడు. స్వామివారి దయ వల్ల నా కష్టాలన్నీ తీరాయి. అనుకున్నది సాధించాను. దీంతో గత ఏడాది గిరి ప్రదక్షిణ చేశా. మళ్లీ ఈసారి చేస్తున్నా. స్వామి చల్లగా చూస్తే వచ్చే ఏడాది కూడా వస్తా. భక్తి భావనతో 32 కిలోమీటర్లు నడిచినా ఏ మాత్రం ఇబ్బంది అనిపించదు.

బంధువులు చెప్పడంతో మొదటిసారి ప్రదక్షిణ చేస్తున్నా..

- ఇప్పిలి నారాయణరావు, చీపురుపల్లి, విజయనగరి జిల్లా



గిరి ప్రదక్షిణ చేసి స్వామి వారిని దర్శించుకుంటే అంతా మంచి జరుగుతుందని బంధువులు చెప్పడంతో తొలిసారి వచ్చా. మొత్తం పదిమంది స్నేహితులం గిరి ప్రదక్షిణ చేస్తున్నాం. స్వామి వారి నామస్మరణతో ఉత్సాహంగా ముందుకు సాగుతున్నాం. అప్పన్న స్వామి అనుగ్రహం ఉంటే ఏటా వస్తా.

తొలిసారి వచ్చా..

-బి.పైడితల్లి, దత్తిరాజేరు, విజయనగరం జిల్లా



మా ఇంటి చుట్టుపక్కల వారంతా చెప్పడంతో తొలిసారిగా గిరి ప్రదక్షిణలో పాల్గొంటున్నా. ప్రదక్షిణ పూర్తి చేసే శక్తిని ఆ సింహాచలేశుడే ఇస్తాడనే నమ్మకంతో ముందుకు సాగుతున్నా. ఇంత రద్దీని చూస్తుంటే ఆనందంగానూ, కాస్త భయంగానూ ఉంది.

మా నాన్నమ్మ స్ఫూర్తితో..

-హాసిని, పెందుర్తి



గిరి ప్రదక్షిణ చేయడం వల్ల ఎంతో మంచి జరుగతుందని మా నాన్నమ్మ చెప్పిన మాటలకు స్ఫూర్తి చెంది తొలిసారి మా అమ్మతో కలిసి ప్రదక్షిణలో పాల్గొంటున్నా. భక్తుల కోరికలు తీర్చే అప్పన్న స్వామి నాకు మంచి భవిష్యత్తును ప్రసాదించాలని వేడుకుంటున్నా.

పదేళ్లుగా ప్రదక్షిణలో పాల్గొంటున్నా..

- ఎం.సునీత, రణస్థలం, శ్రీకాకుళం జిల్లా



మా గ్రామస్థులతో పాటు మా కుటుంబ సభ్యులందరం సింహాద్రి అప్పన్న స్వామి భక్తులమే. స్వామి వారిని కొలిస్తే కష్టకాలంలో అండగా ఉంటారన్నది మా నమ్మకం. ఏటా గిరి ప్రదక్షిణలో ఉపవాస దీక్షతో పాల్గొంటా. గత పదేళ్లుగా గిరి ప్రదక్షిణ చేస్తున్నా.

బటర్‌ఫ్లై పార్కు స్థలం ప్రైవేటు వ్యక్తులకు బదలాయింపుపై హైకోర్టు స్టే

విశాఖపట్నం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఆరో వార్డు పరిధి ఎంఎస్ఆర్ లేఅవుట్‌లోని బటర్‌ఫ్లై పార్కు స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు బదలాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మే నెలలో జారీచేసిన ఉత్తర్వులపై హైకోర్టు బుధవారం స్టే విధించింది. మధురవాడ సర్వే నంబర్ 193/1పిలో ఉన్న బటర్‌ఫ్లై పార్కులోని 489.39 చదరపు గజాల స్థలాన్ని పిళ్లా లక్ష్మణపాత్రుడు, పోతిన అప్పారావు అనే వారికి ఇచ్చి, అంతే విస్తీర్ణం కలిగిన స్థలాన్ని తీసుకునేందుకు వీలుగా రాష్ట్రప్రభుత్వం ఈ ఏడాది మే నెలలో మెమో జారీచేసింది. అయితే పార్కులు, ఓపెన్ స్పేస్‌లను ఇతర ప్రయోజనాలకు వినియోగించడం, బదలాయించడం సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధమని, ప్రజా ప్రయోజనాలకు వినియోగించాల్సిన పార్కుస్థలాన్ని ఇతరులకు బదలాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మెమోను రద్దు చేస్తూ ఆదేశాలు జారీచేయాలని కోరుతూ జనసేనకు చెందిన 22వ వార్డు కార్పొరేటర్ పీతలమూర్తియాదవ్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం విచారణ జరిపిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీరాజ్‌సింగ్ ఠాకూర్, చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత రాష్ట్ర ప్రభుత్వం మే నెలలో ఇచ్చిన మెమోపై స్టే విధించింది.

840 కిలోల గంజాయి స్వాధీనం

- నలుగురు నిందితుల అరెస్టు
- నక్కపల్లి పోలీసులను అభినందించిన ఎస్పీ తుహిన్‌సిన్హా


పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీస్ అధికారులు

అనకాపల్లి రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నక్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 840 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని, నలుగురు నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. ఇక్కడి జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఇందుకు సంబంధించిన వివరాలను విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలానికి చెందిన సుక్రి అర్జున్, అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం పెద్దపేట గ్రామానికి చెందిన కొదమ నాగరాజు, పాంగి అర్జునరావు, వంతల సురేష్‌లు కలిసి ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా జనబ ప్రాంతంలో 840 కిలోల గంజాయిని కొనుగోలు చేశారని ఎస్పీ తెలిపారు. దీనిని ఇరవై బస్తాలలో బొలేరో వాహనంలో లోడ్ చేయించి దారకొండ, చింతపల్లి మీదుగా బుధవారం నర్సీపట్నానికి చేరుకున్నారన్నారు. అనంతరం నర్సీపట్నం, తాళ్లపాలెం మీదుగా కర్ణాటకకు తీసుకువెళుతుండగా, ముందస్తు సమాచారం మేరకు నక్కపల్లి పోలీసులు అప్రమత్తమయ్యారన్నారు. వెదుళ్లపాలెం జంక్షన్ వద్దకు సదరు వాహనం రాగా తనిఖీల నిర్వహించి, గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు నలుగురు నిందితులను అరెస్టు చేశారన్నారు. పట్టుబడిన ఈ గంజాయి విలువ రూ 42 లక్షలు ఉంటుందని చెప్పారు. ఇటీవల కాలంలో అత్యధికంగా పట్టుబడిన గంజాయి కేసుల్లో ఇదొకటిగా ఎస్పీ పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న ఇతర నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. గంజాయిని చాకచక్యంగా పట్టుకున్న పోలీస్ బృందాన్ని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు, నగదు రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు ఎల్.మోహనరావు (క్రైమ్), ఎం.దేవప్రసాద్ (అడ్మిన్), నర్సీపట్నం డీఎస్పీ పోతురెడ్డి శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జడ్పీ చైర్‌పర్సన్‌కు షాక్

... 5వ పేజీ తరువాయి

లేవన్నారు. జడ్పీటీసీ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసి ఈ ఏడాది సెప్టెంబరు 24 నాటికి నాలుగు సంవత్సరాలవుతోందని, తమకు కనీస మర్యాద, గౌరవం లేవని మునగపాక జడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ ఆరోపించారు. సెప్టెంబరు 24వ తేదీ తరువాత అవిశ్వాసం ప్రతిపాదిస్తామన్నారు. బుధవారం సమావేశానికి మైదాన ప్రాంతంలో 18 మంది, ఏజెన్సీలో నలుగురు హాజరుకాలేదు. వారిలో ఇద్దరు వైస్ చైర్మన్లు బీవీ సత్యవతి, సుంకరి గిరిబాబు ఉన్నారు. కాగా విశాఖ జిల్లాలో 39 మంది జడ్పీటీసీ సభ్యులు ఉండగా ఇద్దరు మృతిచెందారు. మరొకరు రాజీనామా చేశారు. చైర్‌పర్సన్‌ను మినహాయిస్తే ప్రస్తుతం 35 మంది సభ్యులు ఉన్నారు. అందులో టీడీపీ, సీపీఎంలకు ఒక్కొక్క సభ్యుడు ఉన్నారు. అవిశ్వాసం ప్రతిపాదించాలంటే 21 మంది సభ్యుల మద్దతు ఉండాలి.

గిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు

... 5వ పేజీ తరువాయి

ఫలహారాలు, పండ్లు, పానీయాలు అందించారు. ఎవరికీ ఆకలి దప్పిక లేకుండా చేశారు. కాళ్ల నొప్పులతో మార్గం మధ్యలో కూలబడిపోయిన వారికి సత్యసాయి సేవా సంస్థ సభ్యులు ఆయుర్వేద తైలం రాసి, మసాజ్ చేసి పునరుత్తేజం కల్పించారు.

ఏఐ సాయంతో భక్తుల సంఖ్య లెక్కింపు

ఏటా గిరి ప్రదక్షిణకు ఎంత మంది భక్తులు వచ్చారనేది ఒక అంచనాగా చెప్పేవారు. గత ఏడాది నాలుగు లక్షల మంది పాల్గొనగా ఈసారి ఐదు లక్షల మంది వస్తారని భావించి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. బందోబస్తు, భక్తుల భద్రత కోణంలో గిరి ప్రదక్షిణ మార్గం 32 కి.మీ. పొడవునా ఈసారి సీసీ కెమెరాలు పెట్టారు. ముఖ్యమైన జంక్షన్లలో కొన్నింటికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించారు. మనుషుల ముఖాలను గుర్తు పట్టే విధంగా చేశారు. దాంతో గిరి ప్రదక్షిణలో ఎంత మంది పాల్గొన్నారనేది కచ్చితంగా తెలుసుకునే అవకాశం ఏర్పడింది. పోలీసులు, జీవీఎంసీ అధికారులు కలిసి ఈ వ్యవస్థను ఏర్పాటుచేశారు.

ట్రాఫిక్ జామ్

గిరి ప్రదక్షిణకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ మళ్లించారు. అయితే శివారుప్రాంతాలతో పాటు సాయంత్రం నుంచి జాతీయ రహదారిపైనా ట్రాఫిక్ జామ్ అయ్యింది. వేపగుంట జంక్షన్ పద్మవ్యూహంగా మారిపోయింది. హనుమంతవాక జంక్షన్, వెంకోజీపాలెం, ఎన్ఏడీ జంక్షన్‌లలో వాహన చోదకులు ఇబ్బందిపడ్డారు.

నత్తనడకన రహదారి విస్తరణ పనులు

... 5వ పేజీ తరువాయి

జరుగుతున్నాయని, మిగిలిన 90 శాతం పనులు చేయాలంటే రైతుల అంగీకారం కావాలన్నారు. రైతులకు టీడీఆర్ బాండ్లు ఇస్తామంటున్నారని, దానిపై వారికి అవగాహన లేదన్నారు. రోడ్డు విస్తరణ పూర్తయితే తప్ప అచ్యుతాపురంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాదని పేర్కొనడంతో కలెక్టర్ స్పందించి.. త్వరలో రైతులు, ప్రజాప్రతినిధులతో కలిసి సమావేశం నిర్వహిస్తామన్నారు. రోడ్డు పనులను తానే స్వయంగా పర్యవేక్షిస్తానని తెలిపారు.

నిధుల కేటాయింపులో అన్యాయం

జలవనరుల శాఖపై చర్చలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులో విశాఖ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఉత్తరాంధ్రలోని నీటి పారుదల ప్రాజెక్టుల పూర్తికి సంబంధించి రోడ్‌మ్యాప్‌లో విశాఖ జిల్లాలో ప్రాజెక్టుల ప్రస్తావన ఎందుకు లేదని ఎస్ఈ స్వర్ణకుమార్‌ను ప్రశ్నించారు. ఇంజనీర్ల నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. దీనిపై మూడు జిల్లాల కలెక్టర్లు స్పందించి ప్రభుత్వానికి సమస్య తెలియజేయాలని కోరారు. ఏజెన్సీలో చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలకు జడ్పీ నిధులు ఇవ్వాలని అల్లూరి సీతారామరాజు కలెక్టర్.. జడ్పీ చైర్‌పర్సన్‌ను కోరారు. వైద్య ఆరోగ్యశాఖపై చర్చ జరిగినప్పుడు కో- ఆప్షన్ సభ్యుడు నిర్మల్‌కుమార్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ రోగి ఉన్న ఇంట్లో ఆయనతో పాటు వృద్ధులకు వేర్వేరుగా పింఛన్లు ఇవ్వడంలేదని ఫిర్యాదు చేశారు. దీనిపై విశాఖ కలెక్టర్ హరేంధిరప్రసాద్ వెంటనే స్పందించి ఒకే ఇంట్లో ఉన్న హెచ్‌ఐవీ రోగులు, వితంతులు/వృద్ధులకు అర్హత మేరకు వేర్వేరుగా పింఛన్లు ఇస్తారని, దీనిపై డీఆర్‌డీఏ అధికారులను సంప్రతించాలన్నారు. మాడుగుల ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో షెడ్యూల్ మేరకు ప్రతి వారం పీహెచ్‌సీలకు వైద్య నిపుణులు రావాలన్నారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర మాట్లాడుతూ అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో ఆదివారం కూడా పోస్టుమార్టం నిర్వహించాలని కోరారు. వ్యవసాయ శాఖ చర్చలో అనకాపల్లి వ్యవసాయాధికారి మోహనరావు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కోసం గ్రామాల వారీగా అర్హులైన రైతుల వివరాలపై సిబ్బంది సర్వే చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వే కొనసాగుతుందా? అని సభ్యులు ప్రశ్నించగా, విశాఖపట్నం కలెక్టర్ హరేంధిరప్రసాద్ బదులిస్తూ తక్కువ గ్రామాలను తీసుకుని 250 ఎకరాలకు ఒక బ్లాక్‌గా ప్రస్తుతం రీసర్వే చేస్తున్నామన్నారు. రీసర్వేలో సమస్యలు పరిష్కరించడానికి రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని ప్రభుత్వం రద్దు చేసిందని ఈ సందర్భంగా ఆయన వివరించారు. కోటవురట్ల జడ్పీటీసీ సభ్యురాలు ఎస్.ఉమాదేవి మాట్లాడుతూ జడ్పీకి 15వ ఆర్థిక సంఘం మంజూరు చేసిన నిధుల నుంచి జడ్పీటీసీ సభ్యులకు కేటాయించారని, ఇంకా మిగిలిన నిధులను మండలాలకు కేటాయించిన విషయం సభ్యులకు చెప్పడంలేదని ఆక్షేపించారు. అచ్యుతాపురం జడ్పీటీసీ సభ్యుడు లాలం రాంబాబు మాట్లాడుతూ పారిశ్రామికీకరణతో అచ్యుతాపురంలో భూగర్భజలాలకు తీవ్ర ఇబ్బంది వచ్చిందని ఆందోళన వ్యక్తంచేశారు. నీటి ఎద్దడి నివారించేందుకు ఏలేరు కాలువ నుంచి నీటిని మళ్లించాలని కోరగా, చర్యలు తీసుకుంటామని కలెక్టర్ విజయకృష్ణన్ హామీ ఇచ్చారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	75.00
లైవ్ ధర	95.00
విత్ స్కిన్	160.00
స్కిన్ లెస్	170.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544